


epaper. aksharakalam. com

# అక్షరకలం


తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

సంపుటి : 18 సంచిక : 13 | 27-02-2026 శుక్రవారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 12 వెల : రూ.1.00

## ప్రధాని నరేంద్రమోడీ అరుదైన రికార్డు

భారత ప్రధాని నరేంద్ర మోదీ మరో అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నారు. ప్రపంచంలో 100 మిలియన్ ఇన్‌స్టా ఫాలోవర్లు కలిగిన తొలి రాజకీయ నేతగా సరికొత్త రికార్డును నెలకొల్పారు. 2014లో ప్రధాని మోదీ తొలిసారిగా ఇన్‌స్టాగ్రామ్‌లో చేరారు. యువతరానికి కనెక్ట్ కావడంతో ఆయన ఫాలోవర్ల సంఖ్య నాటి నుంచీ పెరుగుతూనే ఉంది. ఫాలోవర్ల సంఖ్యాపరంగా ప్రధాని మోదీ తరువాతి స్థానంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిలిచారు.



వార్త 2లో

## తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. మొత్తం 45 మందిని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా అవసరాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఒకేసారి 45 మంది ఐఏఎస్ అధికారులకు బదిలీలు, పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల్లో కలెక్టర్ల స్థాయిలో పెద్దఎత్తున మార్పులు చోటుచేసుకున్నాయి. పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం జరిగింది. మహబూబాబాద్, మెదక్, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించారు.




వార్త 2లో

## వివాహ బంధంతో ఒక్కటైన విరోష్

నటులు విజయ్ దేవరకొండ, రష్మిక వివాహబంధంతో ఒక్కటైనట్లు తెలుస్తోంది. గురువారం ఉదయం 10.10కి రష్మిక మెడలో విజయ్ మూడుముళ్లు వేసినట్లు సమాచారం . దీంతో ఈ జంటకు అభిమానులు శు భాకాంక్షలు తెలుపుతూ పోస్టలు పెడుతున్నారు. ఈ పెళ్లి వేడుక రెండు సంస్కృతులు, సంప్రదాయాల కలయికగా జరుగుతోంది. ఉదయం విజయ్ వైపు నుంచి హిందూ సంప్రదాయ పద్ధతిలో వివాహం జరిగింది. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ వేదికగా జరుగుతోన్న ఈ వివాహానికి ఇండస్ట్రీ ప్రముఖులు హాజరయ్యారు.



వార్త 2లో



## ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఆ దేశ న్యాయస్థానాల్లో వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ప్రపంచ దేశాలపై సుంకాల విషయాల ఇప్పటికే కోర్టు నుంచి వ్యతిరేక తీర్పు రాగా.. తాజాగా వలసదారుల విషయంలోనూ అదే అనుభవం ఎదురైంది. అక్రమ వలసదారులను వారికి సంబంధం లేని ఇతర దేశాలకు తరలించడాన్ని అక్కడి ఫెడరల్ కోర్టు తప్పుబట్టింది అక్రమ వలసదారుల విషయంలో ట్రంప్ కార్యవర్గం తీసుకున్న నిర్ణయాన్ని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ మసాచుసెట్స్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి తీర్పునిచ్చారు.

వార్త 2లో



## విహెచ్, జెట్టిలకు రాజ్యసభ ఇవ్వాలి

తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాల్లో కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు, జెట్టి కుసుమ కుమార్‌లకి ఇవ్వాలని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి గురువారం ఢిల్లీలో కలిశారు. ఖర్గేతో ఆయన పలు కీలక అంశాలపై చర్చించారు.

వార్త 2లో

## తెలంగాణలో దుర్మార్గమైన ప్రభుత్వం

- పేదల ఇళ్లు కూల్చిన దుర్మార్గులు
- ముగ్గురు మంత్రుల పన్నాగం ఇది
- అసెంబ్లీలో మీ పక్షాన పోరాడుతాం
- కోర్టుల్లో పైసా ఖర్చు లేకుండా నిలబడతాం
- వెలుగుమట్ల బాధితులను పరామర్శించిన కెటిఆర్



తెలంగాణలో దుర్మార్గమైన ప్రభుత్వం రాజ్యమేలుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో తొలగించిన ఆక్రమణలను కేటీఆర్ పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. వచ్చే నెల16వ తేదీ నుంచి అసెంబ్లీ ప్రారంభ మవుతుందని ఖమ్మం ప్రజల సమస్యను అసెంబ్లీలో ప్రస్తావిస్తామని అన్నారు. మీ అందరికీ న్యాయం జరిగేవరకూ మీ పక్షాన ప్రభుత్వంపై పోరాడతామని చెప్పుకొచ్చారు. తాము అధికారంలోకి రాగానే మీ అందరికీ ఇదే స్థలంలో ఇళ్లస్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తామని కేటీఆర్ భరోసా కల్పించారు.

వార్త 2లో



2 లో..

## చిన్నారి మృతి కారకులను శిక్షించాలి

## ఇంటర్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్

### పట్టుబడ్డ నలుగురు విద్యార్థులు

హైదరాబాద్,

రాష్ట్రంలో బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షల రెండో రోజు గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఇంటర్‌మీడియట్ బోర్టు సెక్రటరీ తెలిపారు. మొత్తం 4,63,354 మంది విద్యార్థులకు గాను 4,52,980 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని వివరించారు. 10,374 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. వరంగల్‌లో 3, రంగారెడ్డి జిల్లాలో ఒకరు మాల్ ప్రాక్టీసు కు పాల్పడుతూ అధికారులకు పట్టుబడ్డారని పేర్కొన్నారు. వనపర్తి, వికారాబాద్, భద్రాద్రి, ఆదిలాబాద్, మంచిర్యాల, వరంగల్, సిద్దిపేట, మెదక్, కరీంనగర్, ములుగు, పెద్దపల్లి పరీక్షా కేంద్రాల పర్యవేక్షణకు పరిశీలకులను నియమించినట్లు తెలిపారు.



## సిఎం రేవంత్‌లో హిమాచల్ మంత్రి భేటీ

హిమాచల్ ప్రదేశ్ మంత్రి విక్రమాదిత్య సింగ్ హైదరాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసారు. మంత్రిని సిఎం సాదరంగా స్వాగతించి సన్మానించారు.



## భారతీయ విద్యాభవన్ తరహాలో స్కూళ్లు

- మౌళిక వసతులతో పాటు..బ్రేక్‌ఫాస్ట్
- విజయ డెయిరీ ద్వారా అవసరమైన పాల సరఫరా
- రవాణా కోసం ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం
- ప్రైవేట్ స్కూళ్ల ఫీజులకు కళ్లెం వేసేలా చర్యలు
- విద్యారంగంపై సమీక్షలో సిఎం రేవంత్ కీలక ఆదేశాలు

హైదరాబాద్, **అక్షరకలం ప్రతినిధి** కోర్ అర్బన్ రీజియన్‌లో ప్రభుత్వ స్కూల్స్‌లో మౌలిక సదుపాయాల కల్పనపైన దృష్టి సారించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. భారతీయ విద్యా భవన్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూళ్లల్లో ఉన్న మౌలిక సదుపాయాలు ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఉండాలని సూచించారు. గురువారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌పైన సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశర చేశారు. ఈ సమావేశానికి సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణా రెడ్డి , విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా , కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కుమార్, అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని మార్గనిర్దేశం చేశారు. ఇందుకోసం విజయా డైరీ నుంచి పాలు సేకరించాలని సూచించారు. వినియోగించాలని దిశానిర్దేశర చేశారు.

# ప్రధాని నరేంద్రమోడీ అరుదైన రికార్డు

## ఇన్‌స్టాలో వంద మిలియన్ల దాటిన ఫాలోవర్లు

**న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి**

:భారత ప్రధాని నరేంద్ర మోదీ మరో అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నారు. ప్రపంచంలో 100 మిలియన్ ఇన్‌స్టా ఫాలోవర్లు కలిగిన తొలి రాజకీయ నేతగా సరికొత్త రికార్డును నెలకొల్పారు. 2014లో ప్రధాని మోదీ తొలిసారిగా ఇన్‌స్టాగ్రామ్‌లో చేరారు. యువతరానికి కనెక్ట్ కావడంతో ఆయన ఫాలోవర్ల సంఖ్య నాటి నుంచీ పెరుగుతూనే ఉంది. ఫాలోవర్ల సంఖ్యాపరంగా ప్రధాని మోదీ తరువాతి స్థానంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిలిచారు. ఆయనను ఇన్‌స్టాలో ఫాలో అయ్యే వారి సంఖ్య 43.2 మిలియన్‌లు. ఆ తరువాతి స్థానాల్లో ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబొవో సుబియాంతో (15 మిలియన్ ఫాలోవర్లు), బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డి సిల్వా (14.4 మిలియన్ ఫాలోవర్లు), తుర్కియే అధ్యక్షుడు ఎర్డొగాన్ (11.6 మిలియన్ ఫాలోవర్లు), అ÷-జ్గ÷ంటీనా ప్రెసిడెంట్ జేవియర్ (6.4 మిలియన్ ఫాలోవర్లు) ఉన్నారు. ట్రంప్‌తో పాటు ఆ తరువాత నాలుగు స్థానాల్లో ఉన్న నేతల ఫాలోవర్ల సంఖ్యను కూలిపి చూసినా ప్రధాని మోదీ కంటే తక్కువగానే ఉండటం గమనార్హం. ఇక భారతీయ నేతల్లో కూడా ఫాలోవర్ల సంఖ్యాపరంగా ప్రధాని నెం.1గానే ఉన్నారు. ప్రధాని తరువాతి స్థానంలో ఉన్న యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు 16.1 మిలియన్ ఇన్‌స్టా ఫాలోవర్లు ఉండగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఉన్న ఫాలోవర్ల సంఖ్య 12.6 మిలియన్లు. సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉండే ప్రధాని ఇన్‌స్టా వేదికగా వివిధ అధికారిక కార్యక్రమాలు, అంతర్జాతీయ పర్యటనలు, రాజకీయ కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు వివరాలను పంచుకుంటూ ఉంటారు. తన మనసులోని భావాలను కూడా ఫాలోవర్లతో షేర్ చేసుకుంటుంటారు.

# తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

## మొత్తం 45మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు

## పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. మొత్తం 45 మందిని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా అవసరాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఒకేసారి 45 మంది ఐఏఎస్ అధికారులకు బదిలీలు, పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల్లో కలెక్టర్ల స్థాయిలో పెద్దఎత్తున మార్పులు చోటుచేసుకున్నాయి. పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం జరిగింది. మహబూబాబాద్, మెదక్, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించారు. టీఎస్‌జీపీడీసీఎల్‌కు కొత్త సీఎండీ నియామకం జరిగింది. సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ముఖ్యకార్యదర్శిగా రాహుల్ బొజ్జా నియమితులయ్యారు. బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శిగానూ ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్‌కుమార్, విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిషోర్‌ను నియమించారు. ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ విభాగం కార్యదర్శిగా గౌరవ్ ఉప్పల్, దేవాదాయశాఖ కమిషనర్‌గా ఎం.హనుమంతరావు, ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా డి.దివ్యను ప్రభుత్వం నియమించింది. వీరితో పాటు పలు జిల్లా కలెక్టర్లనూ ప్రభుత్వం బదిలీ చేసింది. యాదాద్రి భువనగిరి కలెక్టర్‌గా అనురాగ్ జయంతిని నియమించింది.పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సంజయ్ కుమార్‌ను నియమించారు. విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా దాన కిషోర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా శ్రీధర్‌ను నియమించారు. ఎండోమెంట్స్ కమిషనర్‌గా హనుమంతరావుకు కొత్త బాధ్యతలు అప్పగించారు. ఫైనాన్స్ శాఖ సెక్రటరీగా గౌరవ్ ఉప్పల్‌ను నియమించారు. ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఎన్.శ్రీధర్‌కు బాధ్యతలు అప్పగించారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా చిత్రా మిశ్రాను నియమించారు. విజయేంద్ర – మహబూబ్‌నగర్ కలెక్టర్ పదవి నుంచి సోషల్ వెల్ఫేర్ శాఖ కార్యదర్శిగా నియామకం అయ్యారు. అద్వైత్ కుమార్ సింగ్ – మహబూబాబాద్ నుంచి ఢిల్లీ తెలంగాణ భవన్ సమన్వయ శాఖకు బదిలీ అయ్యారు. సిక్తా పట్నాయక్ – నారాయణపేట్ నుంచి ఆర్థిక శాఖకు ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ అయ్యారు. సందీప్ కుమార్ ఝా – జనగాం కలెక్టర్‌గా నియామకం అయ్యారు. ముష్రఫ్ అలీ ఫారూఖీ – టీఎస్‌జీపీడీసీఎల్ సీఎండీగా నియామకం అయ్యారు. జితేష్ వి.పాటిల్ – టీఎస్‌జీపీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. స్నేహ శబరీష్ – మహబూబాబాద్ కలెక్టర్‌గా నియామకం అయ్యారు. గరిమా అగర్వాల్– రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌గా నియామకం జరిగింది. ప్రతిమ సింగ్ – మెదక్ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. అనికేత్ – భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌గా ,చాహత్ బజ్పాయి – హనుమకొం డ కలెక్టర్‌గ ా,ఖుష్బూ గుప్తా – మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా , పమేలా సత్పతి – లేబర్ కమిషనర్‌గా, అనురాగ్ జ యంతి – యాదాద్రి కలెక్టర్‌గా ,ప్రదీప్ జైన్ – నారాయణపేట్ కలెక్టర్‌గా నియామకం జరిగింది.

# వివాహ బంధంతో ఒక్కటైన విరోష్

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

నటులు విజయ్ దేవరకొండ, రష్మిక వివాహబంధంతో ఒక్కటైనట్లు తెలుస్తోంది. గురువారం ఉదయం 10.10కి రష్మిక మెడలో విజయ్ మూడుముళ్లు వేసినట్లు సమాచారం . దీంతో ఈ జంటకు అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టులు పెడుతున్నారు. ఈ పెళ్లి వేడుక రెండు సంస్కృతులు, సంప్రదాయాల కలయికగా జరుగుతోంది. ఉదయం విజయ్ వైపు నుంచి హిందూ సంప్రదాయ పద్ధతిలో వివాహం జరిగింది. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ వేదికగా జరుగుతోన్న ఈ వివాహానికి ఇండస్ట్రీ ప్రముఖులు హాజరయ్యారు. ఈ వివాహ సంబరాల్లో భాగంగా విజయ్ – రష్మిక 'విరోష్ ప్రీమియర్ లీగ్' పేరుతో సరదాగా ఓ చిన్న క్రికెట్ మ్యాచ్‌ను నిర్వహించినట్లు ఇన్‌స్టా వేదికగా పంచుకున్నారు. అలాగే బుధవారం హల్దీ వేడుకను నిర్వహించినట్లు విరోష్ జోడీ తెలియజేసింది. ఇక వీరి వివాహ విందును మార్చి 4న హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు.

# ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ

## వసలదారుల పట్ల అనుసరిస్తున్న విధానంపై కోర్టు ఆగ్రహం

**న్యూయార్క్, అక్షరకలం ప్రతినిధి**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఆ దేశ న్యాయస్థానాల్లో వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ప్రపంచ దేశాలపై సుంకాల విషయాల ఇప్పటికే కోర్టు నుంచి వ్యతిరేక తీర్పు రాగా.. తాజాగా వలసదారుల విషయంలోనూ అదే అనుభవం ఎదురైంది. అక్రమ వలసదారులను వారికి సంబంధం లేని ఇతర దేశాలకు తరలించడాన్ని అక్కడి ఫెడరల్ కోర్టు తప్పుబట్టింది అక్రమ వలసదారుల విషయంలో ట్రంప్ కార్యవర్గం తీసుకున్న నిర్ణయాన్ని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ మసాచుసెట్స్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి తీర్పునిచ్చారు. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్రమ వలసదారులను చేసిన సంగతి తెలిసిందే. అక్రమ వలసదారులను అమెరికా నుంచి గ్వాటమాల, దక్షిణ సూడాన్, కోస్టారికా వంటి ఇతర దేశాలకు తరలించారు. దీంతో ఈ తరలింపు ముప్పును ఎదుర్కొంటున్న వలసదారులు కోర్టులో దావా వేశారు. దావాపై తాజాగా న్యాయస్థానంలో విచారణ జరిగింది. సరైన భద్రతా చర్యలు తీసుకోకుండా, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, తగిన సమయం ఇవ్వకుండా వారికి సంబంధం లేని వేరే దేశాలకు తరలించడం చట్ట విరుద్ధమని కోర్టు తీర్పునిచ్చింది (÷బిIటIసజీ ఇనీబీసబి తిపపతిణసజీబితినీని ఇజీబI). ట్రంప్ కార్యవర్గం నిర్ణయాన్ని తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు ట్రంప్ యంత్రాంగానికి 15 రోజుల సమయం ఇచ్చింది.



# విహెచ్, జెట్టిలకు రాజ్యసభ ఇవ్వాలి

## ఆ ఇద్దరి సభ్యత్వాలపై ఆలోచన చేయాలని

## ఖర్గేను కలిసి కోరిన కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**న్యూఢిల్లీ,**



తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాల్లో కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు, జెట్టి కుసుమ కుమార్‌లకి ఇవ్వాలని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి గురువారం ఢిల్లీలో కలిశారు. ఖర్గేతో ఆయన పలు కీలక అంశాలపై చర్చించారు. తెలంగాణలో ఖాళీ కానున్న రెండు రాజ్యసభ స్థానాలపై సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్, ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తో కూడా ఈ విషయంపై మాట్లాడానని, వి. హనుమంతరావు, జెట్టి కుసుమ కుమార్‌లకి రాజ్యసభ ఇవ్వాలని కోరానని అన్నారు. ఇదే విషయంపై రాహుల్ గాంధీని, మల్లికార్జున్ ఖర్గేని కలవడానికి ఢిల్లీకి వచ్చానని తెలిపారు. రాహుల్ గాంధీ ముందస్తు షెడ్యూల్ కారణంగా ఆయన బిజీగా ఉన్నారని చెప్పుకొచ్చారు. వి. హనుమంతరావు. జెట్టి కుసుమ కుమార్‌లకు రాజ్యసభ అవకాశాలపై ఆలోచన చేయాలని కోరానని తెలిపారు. జెట్టి కుసుమ కుమార్.. యూత్ కాంగ్రెస్ లీడర్‌గా, స్టూడెంట్ లీడర్‌గా.. కమ్మ సామాజిక వర్గం నుంచి ఉన్నారని ప్రస్తావించారు. జెట్టి కుసుమ కుమార్ ఫ్యామిలీ ఫ్రీడమ్ ఫైటెర్స్ అని, వాళ్ల కుటుంబం నుంచి అంతా కాంగ్రెస్‌లోనే ఉన్నారని గుర్తుచేశారు. హనుమంతరావు తెలంగాణలో అనేక మంది ముఖ్యమంత్రులతో పని చేశారని వెల్లడించారు. మూడుసార్లు రాజ్యసభ ఎంపీగా పని చేశారని చెప్పుకొచ్చారు. ఆయనకు రాజీవ్ గాంధీ , సోనియాగాంధీ అవకాశాలు ఇచ్చారని తెలిపారు. వి.హనుమంతరావు చురుకైన వ్యక్తి అని, ఆయనకు మరోసారి రాజ్యసభకు అవకాశం ఇవ్వాలని ఖర్గేను కోరానని అన్నారు. కమిటీలో చర్చిస్తామని ఖర్గే హామీ ఇచ్చారని తెలిపారు. రాహుల్ గాంధీ నిర్ణయం మేరకు ముందుకు వెళ్తామని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

# తెలంగాణలో దుర్మార్గమైన ప్రభుత్వం

## పేదల ఇళ్లు కూల్చిన దుర్మార్గులు

## ముగ్గురు మంత్రుల పన్నాగం ఇది

## అసెంబ్లీలో మీ పక్షాన పోరాడుతాం

## కోర్టుల్లో పైసా ఖర్చు లేకుండా నిలబడతాం

## వెలుగుమట్ల బాధితులను పరామర్శించిన కెటిఆర్

**ఖమ్మం, అక్షరకలం ప్రతినిధి**



తెలంగాణలో దుర్మార్గమైన ప్రభుత్వం రాజ్యమేలుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో తొలగించిన ఆక్రమణలను కేటీఆర్ పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. వచ్చే నెల16వ తేదీ నుంచి అసెంబ్లీ ప్రారంభ మవుతుందని ఖమ్మం ప్రజల సమస్యను అసెంబ్లీలో ప్రస్తావిస్తామని అన్నారు. మీ అందరికీ న్యాయం జరిగేవరకూ మీ పక్షాన ప్రభుత్వంపై పోరాడతామని చెప్పుకొచ్చారు. తాము అధికారంలోకి రాగానే మీ అందరికీ





ఇదే స్థలంలో ఇళ్లస్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తామని కేటీఆర్ భరోసా కల్పించారు. అందరూ ధైర్యంగా ఉండాలని అంటూ బాధితులకు కేటీఆర్ మాటిచ్చారు. హైదరాబాద్ నుంచి ఖమ్మం వరకు ఎక్కడ చూసినా కూల్చివేతలేనని ఆరోపించారు. ఖమ్మంలో కూల్చివేసిన కాలనీ చూశానని.. ముగ్గురు మంత్రులకు 60 ఎకరాల మీద కన్నుబడిందని ఆక్షేపించారు. ముగ్గురు మంత్రులు కలిసికట్టుగా ఈ దుర్మార్గం చేశారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఎవరికీ తాము అన్యాయం చేయలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. అందరూ ధైర్యంగా ఉండాలని.. మీ అందరికీ అదే ప్రాంతంలో అక్కడే ఇళ్ల స్థలాలు ఇల్లు ఇస్తామని మాటిచ్చారు. ఇక్కడి వారందరికీ అండగా నిలబడాలని తాను వచ్చానని చెప్పుకొచ్చారు. ఇళ్ల కూల్చివేతపై కోర్టుకి కూడా వెళ్దామని.. మీకెవరికీ ఒక రూపాయి ఖర్చు లేకుండా మీ తరఫున తమ లీగల్ టీం పోరాడుతుందని మాజీమంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. పేదలు ఎంతో కష్టపడి కట్టుకున్నఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్లతో కూల్చివేస్తున్న సంగతి తెలిసిందే. రేవంత్ సర్కార్ కనికరం లేకుండా ఖమ్మం అర్బన్ వెలుగుమట్ల భూదాన్ భూముల్లో పేదల ఇళ్లను నేలమట్టం చేస్తోంది. ఈ క్రమంలో వారికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులను కలిశారు. ఇళ్లు కోల్పోయిన వెలుగు మట్ట బాధితులను కేటీఆర్, పార్టీ నేతలతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మిమ్మల్ని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుస్తరు. మీకు అది చేస్తం.. ఇది చేస్తం.. అది చేస్తమని.. మీ 900 కుటుంబాల్లో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తాడు. మీరు ఐక్యంగా ఉంటేనే విజయం సాధిస్తరు.. లేదంటే వీళ్ల ఏం చేస్తరు. ఏ 100 మందితో వేలి ముద్రలు తీసుకొని మీకు ఆన్నెన్నో ఇస్తరు.. కేసీఆర్ 2000 డబుల్ బెడ్ రూం ఇండ్లు కట్టించారు. వాటిలో కొన్ని మిగులున్నయట. ఆ ఇండ్లలో కొంతమందికిస్తమని చెప్పి వారిని లాక్కెళతారని కేటీఆర్ హెచ్చరించారు. ఓపీడీఆర్ వాళ్లు గతంలో ఎప్పుడో చేసిన పని. పాపం వాళ్లేం తప్పు చేయలేదు.. మీకు పట్టాలిప్పించారు. వాళ్లు తప్పు చేసిందేమి లేదు.. ఇప్పుడు వాళ్లను పట్టుకుని ప్రభుత్వం నానా మాటలు అంటోంది. ల్యాండ్ మాఫియానట.. ఎవడమ్మా ల్యాండ్ మాఫియా.. ఎవడైతే ఇవాళ మీ చుట్టూ వందల ఎకరాలు కొన్నాడో.. ఎవడైతే పేదవాడి ఇల్లు కట్టుకున్నడో వాడు మాఫియానా..? మీకు జరిగిన కష్టం.. మీ ఏడుపులు రాష్ట్రం మొత్తం చూసింది. మీ పిల్లలు, మీరు పడుతున్న అవస్థలు చూసే కేసీఆర్ సార్ మమ్మల్ని పంపించారు. దయచేసి ధైర్యంగా ఉండండి.. మీకు అన్ని రకాలుగా అండగా అజయ్ అన్న, మా ఎంపీ గాయత్రి రవిచంద్ర ఉంటారన్నారు. ఏ తప్పు జరుగకపోతే ఆర్డీవోను ఎందుకు వెంటనే బదిలీ చేశారు. సమాధానం చెప్పాలే ప్రభుత్వం. మంత్రులు తప్పు చేయకపోతే.. నిజంగా ధైర్యముంటే వాళ్లెందుకు రావడం లేదు.. ఇక్కడికి.. వాళ్లొచ్చి మాట్లాడాలి కదా.. అందుకే మీరు ధైర్యంగా ఉండండి. మీ వెంబడి కేసీఆర్ అన్న ఉన్నడు.. కేటీఆర్ అన్న ఉన్నడు. మేమంతా ఉన్నం. ఎట్టి పరిస్థితుల్లో మీకు న్యాయం జరిగేదాకా మేము అండగా ఉంటామని హామీనిచ్చారు. మీకు అన్ని కాగితాలున్నాయి.. కోర్టుకు పోదాం.. కోర్టుకు కూడా మీరు రూపాయి ఖర్చు పెట్టుకునే పని లేదు. పార్టీ తరపున మేం కొట్లాడుతాం.. మీకు మేం అండగా ఉంటాం. మళ్లీ వస్తాం మిమ్మల్ని కాపాడుకుంటాం. న్యాయపరంగా పట్టాలిప్పించే ప్రయత్నం చేస్తాం. దయచేసి ఐకమత్యాన్ని కోల్పోకండి.. సంఘటితంగా, ఒక్కటిగా ఉండండిని సూచించారు.





అక్షరకలం

# చిన్నారి మృతి కారకులను శిక్షించాలి

## లేదంటే హైదరాబాద్‌ను దిగ్బంధిస్తాం

## మాజీమంత్రి తలసాని హెచ్చరిక

**నాగర్‌కర్నూల్, అక్షరకలం ప్రతినిధి**

కుమ్మెర మల్లన్న జాతరలో రెండు నెలల చిన్నారి మృతికి కారణమైన వారిని శిక్షించాలని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం నాగర్ కర్నూల్ కేంద్రంలో కుమ్మెర బాధితుల పక్షాన చేపట్టిన దీక్ష శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజులలో దోషులపై చర్యలు తీసుకోకుంటే హైదరాబాద్‌ను దిగ్బంధం చేస్తామని , అవసరమైతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అభం శుభం తెలియని చిన్నారి మృతికి కారకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. నిందితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు అవుతున్న బడుగు బలహీన వర్గాల ప్రజల పట్ల కొనసాగుతున్న వివక్ష, దాడులు, దౌర్జన్యాలు, ఆలయాల్లో ప్రవేశంపై ఆంక్షలు కొనసాగడం బాధాకరమని అన్నారు.దేవుడిని దర్శించుకునే అర్హత బలహీన వర్గాలకు లేదా ? అని ప్రశ్నించారు. కుమ్మెర దోషులను రక్షించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

## రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

## అరైవ్ - అలైవ్ రెండో విడతలో భాగంగా ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26:**



రోడ్డు ప్రమాదాలు నివారించడం, ప్రతి వాహనదారులు సురక్షితంగా తమ గమ్యస్థానానికి చేరుకోవడమే ప్రధాన లక్ష్యంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. అరైవ్ - అలైవ్ రెండో విడత కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని ఐబి చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై, డంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపి అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ, మద్యం సేవించి వాహన నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రాణం కన్నా విలువైనది ఏదీ లేదని, ప్రతి ఒక్కరు ఖచ్చితంగా ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ, బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని సూచించారు. సురక్షిత ప్రయాణంతో గమ్యస్థానం చేరుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్, మంచిర్యాల ఏసిపి ఆర్ ప్రకాష్, ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్, మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్ రావు, ట్రాఫిక్ సిఐ సత్యనారాయణ, పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతే ప్రాణ భద్రత

## యువతలో చైతన్యం నింపిన టూ టౌన్ పోలీసులు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 26. అక్షర కలం : రోడ్డు ప్రమాదాలను అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాల్సిందేనని జిల్లా పోలీసు అధికారి డి. జానకి స్పష్టం చేశారు. ఆమె ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ టూ టౌన్ పోలీసులు ఎస్.వి డిగ్రీ కళాశాలలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ యజాజుద్దీన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై సమగ్ర అవగాహన కల్పించారు. రహదారులపై లేన్ క్రమశిక్షణ పాటించడం, సురక్షితంగా ముందుకు వెళ్లడం, నియమాలకు విరుద్ధంగా దాటివెళ్లకూడదని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా తల రక్షణ కవచం ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో భద్రతా పట్టా వినియోగం తప్పనిసరి అని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల జరిగే ప్రమాదాలు, చట్టపరమైన శిక్షలు, కుటుంబాలపై పడే దుష్పరిణామాలను ఉదాహరణలతో వివరించారు. నాలుగు సంవత్సరాల పైబడిన పిల్లలకు కూడా తల రక్షణ కవచం అవసరమని తెలియజేశారు. రక్షణాత్మక డ్రైవింగ్ ప్రాముఖ్యతను వివరిస్తూ ముందస్తు అప్రమత్తత, వేగ నియంత్రణ, సురక్షిత దూరం పాటించడం, వాహనం నడుపుతున్నప్పుడు దూరవాణి వినియోగాన్ని పూర్తిగా నివారించాలని సూచించారు. వర్షం, పొగమంచు, రాత్రి వేళల్లో మరింత జాగ్రత్తగా ప్రయాణించాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. యువత ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించి తమతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడాలని పోలీసులు పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతపై చైతన్య కార్యక్రమాలను విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు.




# మహోన్నత చరిత్ర కలిగిన ప్రాంతం గాంధారి ఖిల్లా

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26:**

జిల్లాలోని మందమర్రి మండలంలోని గాంధారి ఖిల్లాకు మహోన్నత చరిత్ర ఉందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్ లో నాయక్ పోడ్ సేవా సంఘం ప్రతినిధి పల్ల సత్యనారాయణ, పుస్తక రచయిత మేసినేని రాజన్న, నాయక్ పోడ్ హక్కుల పరిరక్షణ కమిటీ ప్రతినిధి గంజి రాజన్న, జిల్లా ప్రతినిధులు పెద్ది రాజన్న, గాంధారి మైసమ్మ ఆలయ కమిటీ ప్రతినిధి దైనేని రమేష్ లతో కలిసి గాంధారి ఖిల్లా చరిత్ర భాగం-1 పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పూర్వకాలం ఈ ప్రాంతంలో పాండవులు



పర్యటించినట్లు చరిత్ర ఉందని, గిరిజనులు పాండవులను ఆరాధ్య దైవాలుగా కొలుస్తారని తెలిపారు. తెలంగాణలో వనదేవతలను కొలిచే ఆచారం ప్రసిద్ధి పొందిందని, ఈ క్రమంలో గాంధారి ఖిల్లా మైసమ్మను దేవతగా కొలుస్తారని తెలిపారు. మహోన్నత చరిత్ర కలిగిన గాంధారి ఖిల్లా ప్రాంత వైభవాన్ని, చరిత్రను భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో పుస్తక రచన చేయడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నాగార్జున సాగర్ పర్యాటకానికి కొత్త రూపు

## సమగ్ర కార్యాచరణ సిద్ధం

## సాగర్ తీరంలో పర్యాటక వైభవం.. జాతీయ స్థాయి గుర్తింపు లక్ష్యంగా చర్యలు

## అదనపు కలెక్టర్ శ్రీనివాస్

**ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం**



నాగార్జున సాగర్ ప్రాంతాన్ని రాష్ట్రంలో ప్రముఖ ప్రత్యేక పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యచరణ చేపట్టిందని రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్లో టూరిజం, ఆర్కియాలజీ, రెవెన్యూ ,అటవీ శాఖ అధికారులతో ఈ అంశం పై సమావేశం నిర్వహించారు. ప్రకృతి, ఆధ్యాత్మిక, వారసత్వ, జానపద సంపదల సమ్మేళనంగా ఉన్న నల్గొండ జిల్లాలో అన్ని శాఖల సమన్వయంతో విస్తృత స్థాయిలో డేటా సేకరణ పారమైందన్నారు. బుద్ధవనం, పానగల్ ఛాయా సోమేశ్వర,పచ్చల సోమేశ్వర, దేవాలయాలు, దేవరకొండ కోట, ఫణిగిరి బౌద్ధ స్థలం, చాకలిగుట్టు ద్వీపం, నక్కలగండి ప్రాజెక్ట్, నందికొండ ద్వీపంలోని ఏలేశ్వర ఆలయం, పొగిళ్ల జలపాతాలు, గాజుబేడ గుహలు పర్యాట కేంద్రాలుగా, దేవాలయ ఆచారాలు, యాత్రికుల సంప్రదాయాలు, బ్రహ్మోత్సవాలు, మహాశివరాత్రి, బతుకమ్మ, బోనాలు వంటి పండుగల సందర్భంగా వచ్చే రద్దీపై వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. జాతరలు, వారాంతపు మార్కెట్లు, ఒగ్గుకథ, తోలుబొమ్మలాట వంటి జానపద కళారూపాలను పర్యాటకాభివృద్ధికి అనుసంధానం చేయనున్నామని తెలిపారు. సాంప్రదాయ తెలంగాణ వంటకాలు, ప్రసాద సౌకర్యాలు, హోటళ్లు, లాడ్జీలు, హోమ్‌స్టేలు వంటి వసతి వివరాలు కూడా నమోదు చేయనున్నట్లు తెలిపారు. ప్రజా మరుగుదొడ్లు, తాగునీరు, పార్కింగ్, పాదచారుల మార్గాలు, ఘన వ్యర్థాల నిర్వహణ, నీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాలపై సమీక్ష జరిగింది. పర్యాటక రంగం ద్వారా స్థానిక ఉపాధి అవకాశాలు పెంపొందించడం, విక్రేతలకు అవకాశాలు కల్పించడం లక్ష్యంగా చర్యలు చేపడుతున్నారని తెలిపారు.పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ అటవీ సరిహద్దులు, ఎకో-టూరిజం సామర్థ్యం, కృష్ణా నదీ పరివాహక ప్రాంత రక్షణకు మార్గదర్శకాలు రూపొందించనున్నట్లు అధికారులు తెలిపారు. నాగార్జున సాగర్‌ను జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే సమగ్ర పర్యాటక కేంద్రముగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. ఈ సమావేశంలో రాఘవేంద్ర మాస్టర్ బుద్ధిష్ట్ సర్క్యూట్ టూరిజం కన్సలెంట్ ఓం ప్రకాష్ , ఏఎస్పీ రమేష్, ఆర్డీవోలు అశోక్ రెడ్డి, శ్రీదేవి, రమణారెడ్డి, జిల్లా యువజన, టూరిజం, క్రీడల అధికారి అక్బర్ అలీ పాల్గొన్నారు.

# నిర్ణీత గడువులోగా రోడ్ల పనులు పూర్తి కావాలి

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

## పనుల్లో జాప్యం జరిగితే ఉపేక్షించేది లేదు

## అధికారులకు, కాంట్రాక్టర్లకు మంత్రి హెచ్చరిక

**ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం**



నల్గొండ జిల్లాలో కొనసాగుతున్న రహదారులు, వంతెనల నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం నల్గొండలోని తన క్యాంపు కార్యాలయం ఇందిరాభవన్ లో ఆర్ అండ్ బి ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లాలోని పలు కీలక ప్రాజెక్టుల పురోగతిని ఆయన అడిగి తెలుసుకున్నారు. సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ప్రజల సౌకర్యార్థం చేపట్టిన పనుల్లో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ?బుద్ధారం, అప్పాజిపేట, బ్రాహ్మణవెల్లంల రహదారి పనులను రాబోయే రెండు నెలల్లోగా పూర్తి చేయాలని డెడ్ లైన్ విధించారు. సోమనవాగుపై నిర్మిస్తున్న పగిడిమర్రి వంతెన పనులను మూడు నెలల్లోగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించారు. కనగల్ జంక్షన్ నుండి కనగల్ గ్రామం వరకు నాలుగు లేన్ల రహదారి పనులను తక్షణమే ప్రారంభించాలని మంత్రి సూచించారు. అలాగే కనగల్, తిమ్మన్నగూడెం రహదారి పనుల వేగాన్ని పెంచాలని ఆదేశించారు. నార్కెట్‌పల్లి, మంద్ర రహదారి పనులను వెంటనే మొదలుపెట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను మంత్రి ఆదేశించారు. మామిడాల, గోదోరిగూడెం, ఎల్లమ్మగూడెం గ్రామాలకు సంబంధించిన రోడ్డు పనులను సమీక్షించిన మంత్రి, మామిడాలలో సీసీ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని చెప్పారు. వైటీపీఎస్ రహదారి పనుల పురోగతిని ఆర్ అండ్ బి సూపరింటెండింగ్ ఇంజనీర్‌తో చర్చించి, తగిన సూచనలు చేశారు. నిర్ణయించిన గడువులోగా పనులు పూర్తి చేయని పక్షంలో బాధ్యులైన అధికారులపై, నిర్లక్ష్యం వహించే కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తప్పవుని హెచ్చరించారు. ఈ సమావేశంలో నల్గొండ ఆర్డీవో అశోక్ రెడ్డి, ఆర్ అండ్ బీ సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీధర్ రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గణేష్, పాల్గొన్నారు.

# రైల్వే శాఖ నూతనంగా పాతిన హద్దులు

## రైల్వే శాఖ తీరు ఆక్షేపనీయం

## పాత హద్దులకే పరిమితం కావాలి - సీపీఐ(ఎం)

**అక్షర కలం/ కారేపల్లి:**



కారేపల్లి : డోర్నకల్ - భద్రాచలం రోడ్ రైలు మార్గంలో భూ సేకరణ విషయంలో రైల్వే శాఖ తీరు ఆక్షేపనీయంగా ఉందని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు అన్నారు. డబ్లింగ్ లైన్ కోసం రైల్వే శాఖ పాత హద్దులకే పరిమితం కావాలని కోరుతూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వాసిత రైతులు గురువారం సింగరేణి తహసీల్దార్‌కు వినితిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీపీఐ(ఎం) నాయకులు నాగేశ్వరరావు మాట్లాడుతూ నిర్వాసిత రైతులకు సమాచారం ఇవ్వకుండా రైల్వే లైన్ కోసం గతం హద్దులు కాదని, కొత్తహద్దులు వేయటం తగదన్నారు. సింగరేణి రెవిన్యూ గ్రామ పరిధి నాన్ ఏజన్సీలో ఉండటం, రైల్వే లైన్ క్రింద భూములు కోల్పోతున్న రైతులు పేదవారు కావటంతో వారు ఆందోళన చెందుతున్నారన్నారు. నిర్వాసిత రైతులకు ఉన్నకొద్దిపాటి భూమి పోతే వేరే ప్రాంతంలో బహిరంగ మార్కెట్ రేట్ల ప్రకారం తిరిగి భూమి కొనుగోలు చేయటం కష్టమన్నారు. నిర్వాసిత రైతులకు పరిహారం విషయం తేల్చకుండా అదనంగా భూమిలో హద్దులు పెట్టటం మానుకోవాలని కోరారు. కలెక్టర్ జోక్యం చేసుకోని నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలని వినతిలో కోరారు. ఈకార్యక్రమంలో సీపీఐ(ఎం) సింగరేణి మండల కార్యదర్శి కే.నరేంద్ర, నిర్వాసిత రైతులు ముండ్ల ఏకాంబరం, పాసిని నాగేశ్వరరావు, తురక నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన కలెక్టర్‌గా అంకిత్ ఐఏఎస్ పదవీ బాధ్యతలు స్వీకరణ

**అక్షర కలం/ భద్రాద్రి కొత్తగూడెం:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన జిల్లా కలెక్టర్‌గా అంకిత్, ఐఏఎస్ గురువారం సాయంత్రం 06:19 గంటలకు ఐడీఓసి కార్యాలయంలోని తన ఛాంబర్‌లో తొలి సంతకం చేసి అధికారికంగా పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ సదర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ సిఎండి జితేష్ వి. పాటిల్, ఐఏఎస్ మరియు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. వేణుగోపాల్ నూతన కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది హాజరై నూతన కలెక్టర్‌కు అభినందనలు తెలియజేశారు.అనంతరం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా అధికారుల పరిచయ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా జితేష్ వి. పాటిల్ జిల్లా అధికారులను నూతన కలెక్టర్‌కు పరిచయం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్, ఐఏఎస్ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జిల్లా కలెక్టర్‌గా పని చేసే అవకాశం లభించడం తనకు గౌరవంగా మరియు సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు, లక్ష్యాల మేరకు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పారదర్శకత, ప్రజాహితం ప్రధాన లక్ష్యాలుగా పెట్టుకుని సమర్థవంతమైన పరిపాలన అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ వేగవంతమైన సేవలందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానని అన్నారు .జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు, ప్రజలతో సత్సంబంధాలు నెలకొల్పడం వంటి అంశాల్లో సమగ్రంగా ముందుకు సాగాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్‌కు భద్రాచలం పండితులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం భక్తి వాతావరణంలో జరిగింది.



# చెంచు కాలనీలో ద్విభాగ గృహాలకు నూతన ఊపిరి

## నిలిచిపోయిన పనులు వేగవంతం -- త్వరలో గృహప్రవేశాలు:

## తాసిల్దార్ కిష్టానాయక్ హామీ

**హన్వాడ .ఫిబ్రవరి 26. అక్షర కలం:**

యారోనిపల్లి గ్రామంలోని చెంచు కాలనీలో నిర్మాణంలో ఉన్న ద్విభాగ గృహాల పనులు నిలిచిపోయిన నేపథ్యంలో అధికారులు కదిలారు. పెండింగ్‌లో ఉన్న పనులను అత్యవసరంగా పూర్తి చేసి, అతి త్వరలోనే లబ్ధిదారులకు గృహప్రవేశాలు నిర్వహించి ఇళ్లు అప్పగిస్తామని తాసిల్దార్ కిష్టానాయక్ స్పష్టమైన హామీ ఇచ్చారు. గ్రామ పర్యటనలో భాగంగా చెంచు కాలనీని సందర్శించిన తాసిల్దార్, అక్కడి నిర్మాణ పనులను సమీక్షించారు. గృహాల నిర్మాణం మధ్యలో ఆగిపోవడంతో చెంచు కుటుంబాలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన తాసిల్దార్, పనులు ఎందుకు నిలిచిపోయాయో తెలుసుకుని, సంబంధిత శాఖల అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెంచు కుటుంబాలు ఎంతోకాలంగా స్వంత ఇంటి కల నెరవేర్చుకోవాలని ఎదురుచూస్తున్నాయని పేర్కొన్న ఆయన, ఇకపై ఆలస్యం జరగకుండా పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. నిర్మాణంలో ఉన్న ప్రతి ఇల్లు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు. లబ్ధిదారులందరికీ సకాలంలో ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఉప తాసిల్దార్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ ఉపాధి అధికారి, గ్రామ సర్పంచ్ శవకుల స్వాతి, ఉప సర్పంచ్ మైబమ్మ తదితరులు పాల్గొన్నారు. అధికారులు ఇచ్చిన హామీతో చెంచు కాలనీ వాసుల్లో నూతన ఆశలు నెలకొన్నాయి. త్వరలోనే గృహప్రవేశాల సందడి చూడాలని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# నాలగేళ్లయినా ముగియని ఉక్రెయిన్ సంక్షోభం !

ప్రపంచంలో ఏ యుద్ధాలను తీసుకున్నా నష్టపోతున్నది ప్రజలే. ఆయా దేశాలు ఆర్థికంగా నష్టపోతున్నాయి. ప్రపంచ దేశాలను నష్టాల కుంపట్లో పడేస్తున్నాయి. రష్యా,ఉక్రెయిన్ యుద్ధం మొదలై నాలుగేళ్లు దాటింది. ఎందుకు యుద్ధం మొదలు పెట్టారో తెలియడం లేదు. అలాగని ముగింపు కూడా పలకడం లేదు. ఈ రావణ కాష్టం ఇప్పట్లో చల్లారేలా లేదు. అగ్రరాజ్యం తలచుకుంటే అంతే సంగతులని రష్యా నిరూపిస్తే... అమెరికా దానిని నిజం చేసింది. రష్యా బాటలోనే అమెరికా కూడా అడపాదడపా దాడులతో ప్రపంచాన్ని గుప్పిట పెట్టుకోవాలని చూస్తోంది. ట్రంప్ అధికారంలోకి వచ్చాక భౌతిక దాడులతో పాటు, ఆర్థిక దాడులతో ప్రపంచాన్ని బెంబేలెత్తిస్తున్నారు. ఇకపోతే ఒకప్పటి సోవియట్ యూనియన్‌లోని ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీ చేష్టల కారణంగా రష్యాతో కయ్యానికి దిగారు. పుతిన్, ఎలన్‌స్కీ ఇద్దరూ బాగానే ఉన్నారు. కానీ ఇరు దేశాల ప్రజలు తీరని సంక్షోభంలో కూరుకు పోయాయరు. వేలాదిమంది మృత్యువాత పడ్డారు. ఫిబ్రవరి 24వ తేదీతో ఉక్రెయిన్ యుద్ధం ఐదేయేట ప్రవేశించింది. దీనికి బాధ్యులైన నాటో కూటమి దేశాలు ఎలా, ఎప్పుడు ముగింపు పలుకుతాయో తెలియటం లేదు. నిజానికి ట్రంప్ కూడా ముగింపు చేసే సాహసం జరగడం లేదు. యుద్ధాలకు నేను ముగింపు పలుకుతున్నానని బీరాలు పలికిన ట్రంప్ ఈ యుద్ధాన్ని కూడా ఆపుతానని చెప్పినా, ఆ పని చేయలేక పోయారు. ఉక్రెయిన్ తాజా సంక్షోభానికి నాలుగేళ్లు నిండినప్పటికీ నిజానికి 2014 నుంచి ఈ అంతర్యుద్ధం కొనసాగుతున్నది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఐరోపా ఖండంలో దీర్ఘకాలం సాగిన పోరుగా ఇప్పటికే చరిత్రలో ఉక్రెయిన్ సంక్షోభం నమోదైంది. ఇది ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రపంచం మీద ప్రభావం చూపుతున్నది. ఏ దేశం కూడా ఎదుర్కోని తీవ్రమైన ఆంక్షలను రష్యా మీద నాటో కూటమి దేశాలు అమలు చేస్తున్నాయి. రష్యాతో వాణిజ్య లావాదేవీలు నిర్వహించే భారత్ తదితర దేశాల మీద కూడా అపరాధ పన్నుల విధింపు, ఇతర చర్యలు తీసుకుంటామని అమెరికా బెదిరిస్తున్న సంగతి తెలిసిందే. రష్యా నుంచి చమురు కొనకుండా చేసిన ట్రంప్ ఎలా పెత్తనం సాగిస్తున్నాడో గమనించవచ్చు. ఇప్పటి వరకు ఉక్రెయిన్ పోరులో రెండు దేశాలకు జరిగిన నష్టాల గురించి పరస్పరం అతిశయోక్తులు తప్ప నిజానిజాలు వెల్లడి కావటం లేదు. రెండు వైపులా 20 లక్షల మంది సైనికులు గాయపడటం లేదా మరణించి ఉంటారన్నది ఒక అంచనా. పన్నెండున్నర లక్షల మంది రష్యన్లు మరణించినట్లు ఉక్రెయిన్ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే సిఎస్ఐఎస్ అనే సంస్థ 3.25 లక్షల మంది మరణించటంతో సహా పన్నెండు లక్షల మంది రష్యా వైపు బాధితులు ఉన్నట్లు చెబుతున్నది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఏ పోరులోనూ ఇంత నష్టం జరగలేదు. తమకు వ్యతిరేకంగా నాటో విస్తరణ పేరుతో ఉక్రెయిన్‌కు సభ్యత్వ మిచ్చి తమ ముంగిటకు అణ్వాయుధాలను మోహరించాలన్న అమెరికా ఎత్తుగడలను వమ్ము చేస్తూ గతంలో తన ప్రాంతంగా ఉన్న క్రిమియా ద్వీపాన్ని రష్యా ఆ ఏడాది విలీనం చేసుకుంది. ఉక్రెయిన్ పాలకులు అప్పటి నుంచి రష్యన్లు మెజారిటీగా ఉన్న తమ డాన్‌బాస్ ప్రాంతంపై దాడులకు మిలిటరీని దించారు. దానికి వ్యతిరేకంగా ఆ ప్రాంతంలో తలెత్తిన తిరుగుబాటుకు రష్యా మద్దతు ఇచ్చింది. సైనిక చర్య ప్రారంభించి నప్పటి నుంచి నాలుగేళ్ల కాలంలో 26 శాతం ఉక్రెయిన్ ప్రాంతాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకుంది. మెల్లమెల్లగా కొత్త ప్రాంతాలకు చొచ్చుకుపోతున్నది. ఈ నాలుగేళ్ల యుద్ధ పర్యవసానాలను పరిశీలిస్తే ఇది అంత తేలికగా ముగిసేలా లేదు. పుతిన్ కూడా వదిలేలా లేరు. ఇప్పుడున్న యథాతథ స్థితిలో పోరు ముగించటానికి తాము సిద్ధమేనని, అయితే డాన్‌బాస్ తూర్పు ప్రాంతంలో తమ మిలిటరీ అక్కడే ఉండాలని జెలెన్‌స్కీ పట్టుబడుతున్నాడు. ఉక్రెయిన్ తిరుగుబాటు ప్రాంతాలకు స్వాతంత్ర్యం ఇవ్వాలని, దాని మిలిటరీ బలం, ఆయుధాలను పరిమితం చేయాలని, మరేదేశ మిలిటరీ ఏ రూపంలోనూ ఉక్రెయిన్ గడ్డ మీద ఉండకూడదని పుతిన్ పునరుద్ఘాటిస్తున్నాడు. అయితే అమెరికా ప్రభావంలో ఉన్న జెలెన్‌స్కీ మాత్రం పాత సోవియట్ బంధాన్ని మరచి వ్యవహరించడమే యుద్ధానికి హేతువుగా గుర్తించాలి. ప్రస్తుతం రష్యా ఆధీనంలో ఉన్న ప్రాంతం పారిశ్రామికంగా, మిలిటరీ రవాణాకు కీలకమైన రైల్వేలు, రోడ్లు ఈ ప్రాంతంలోనే ఉన్నందున వాటిని వదులుకొనేందుకు పుతిన్ సిద్ధంగా లేదు. ఇకపోతే దాడుల కారణంగా ఉక్రెయిన్ జనాభా 4.2 కోట్ల మందిలో నాలుగో వంతు మంది ఇతర దేశాలకు తరలిపోయినట్లు చెబుతున్నారు. రష్యా ఆధీనంలోని ప్రాంతాలలో 50 లక్షల మంది నివశిస్తున్నారు. క్రిమియాతో సహా 26 శాతం భూ భాగాన్ని ఉక్రెయిన్ కోల్పోయింది. అయితే జెలెన్‌స్కీ దళాలు తిరిగి స్వాధీనం చేసుకున్న ప్రాంతాలను తీసి వేస్తే ఆ మొత్తం 20 శాతానికి తగ్గినట్లు మరొక అంచనా. గత మూడు సంవత్సరాల్లో పెద్దగా రష్యన్లు ముందుకు పోలేదని మరి కొందరు చెబుతున్నారు. రష్యా సైనిక చర్య ప్రారంభం నుంచి నాలుగేళ్లలో ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా నష్టపోయింది. రష్యా ప్రధాన కేంద్రీకరణ మౌలిక సదుపాయాలను నాశనం చేయటం, ఆర్థిక మూలాలను దెబ్బ తీయటంపైనే కొనసాగుతున్నది. విద్యుత్ సరఫరా తీవ్రంగా దెబ్బతిన్న కారణంగా ఫ్యాక్టరీలను నడిపేందుకు డీజిల్ జనరేటర్లను ఆశ్రయించాల్సిన దుస్థితి. మిలిటరీ చర్య ప్రారంభించిన తొలి రోజుల్లో పుతిన్ యంత్రాంగం వేసిన అంచనాలు దెబ్బతిన్నాయి. నాటో కూటమి దేశాలు ఉక్రెయిన్‌కు అవసరమైన ఆయుధాలు, ఆర్థిక సాయంతో పాటు రష్యన్ మిలిటరీ కదలికల గురించి కీలకమైన సమాచారాన్ని అందించటంతో తీవ్రమైన ఎదురుదెబ్బలు తగిలాయి. దాంతో వ్యూహం మార్చు కోవాల్సి వచ్చింది. కొన్ని వారాల్లో కీవ్ పతనం అవుతుందన మాస్కో అంచనాలు తప్పాయి. రష్యా కోరిన విధంగా కొంత ప్రాంతాన్ని కోల్పోయి ఒప్పందం చేసుకుంటే సరే లేకపోతే ఉక్రెయిన్ గెలిచే అవకాశాలు లేవని డోనాల్డ్ ట్రంప్ గతేడాది నవంబరులో బహిరంగంగానే చెప్పాడు. గతేడాది ఇరాన్ మీద దాడులు, మరోసారి హెచ్చరికలు, వెనిజులా అధ్యక్షుడిని అపహరించిన డోనాల్డ్ ట్రంప్ రష్యా మీద చర్యకు ఎందుకు వెనకాడుతున్నట్లు అని కొందరు విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. రష్యా మీద ఎన్ని ఆంక్షలు విధించినప్పటికీ అవి పనిచేయటం లేదని ట్రంప్‌కు అర్థమైంది. మొత్తానికి ఈ రావణ కాష్టం చల్లారేలా లేదు. ఇరు దేశాలు కూర్చుంటేనే సయోధ్య కుదరగలదు. అమెరికాలాంటి దేశాలు, నాటో జోక్యం వల్లనే ఇది మరింత ముదిరిందన్న సుస్పష్టం.



# ఇందిరమ్మ ఇండ్ల పనులను వేగిరం చేయండి

వచ్చే నెలలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 2,160 ఇండ్లను ఒకే చోట నిర్మాణం

మార్చి మొదటి వారంలో సీఎం చేతుల మిదిగా ప్రారంభోత్సవం

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

ప్రతి బ్లాక్ ను తిరిగి పనుల పురోగతి పరిశీలన

రాష్ట్ర పౌరసరఫరాల మరియు నీటిపారుదల శాఖ మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి

అక్షరకలం సూర్యాపేట



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయించి, రూ.22,500 కోట్ల బడ్జెట్ తో పనులు వివిధ దశల్లో ఉన్నాయని రాష్ట్ర పౌరసరఫరాల మరియు నీటిపారుదల శాఖ మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం హుజూర్నగర్ లోని రామస్వామి వద్ద 110 ఎకరాలలో 125 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్ల ప్లాట్ల పెండింగ్ పనుల పురోగతి పై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి ప్రతి బ్లాకు కాలినడకన తిరుగుతూ అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, ఎలక్ట్రిసిటీ, మొక్కలు నాటడం, వైట్ వాష్ పనులను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నాడు గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో హుజూర్నగర్ నియోజకవర్గంలో నిరుపేదలు, వ్యవసాయ కూలీలు, రైస్ మిల్లులో పనిచేసే వారికి ఆశ్రయం కల్పించాలన్న లక్ష్యంతో 110 ఎకరాల దేవాలయ భూములను మార్కెట్ రేటుకి కొనుగోలు చేసి పనులు ప్రారంభించడం జరిగిందని కానీ రాష్ట్ర విభజన తర్వాత ఆనాటి ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపివేసి డంపింగ్ యార్డ్ మాదిరిగా మార్చిందని మండిపడ్డారు. తిరిగి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 14 సంవత్సరాల నా పట్టుదల, కృషి ఆకాంక్షలతో తిరిగి పనులను ప్రారంభించి ప్రాజెక్టును పూర్తిచేసి పేద ప్రజలకు అందించడం నా చిరకాల స్వప్నం నెరవేరుతుందన్నారు. దీనిని నా అదృష్టంగా భావిస్తున్నానని, 1 ప్లాట్ కు రూ. 6 లక్షలు ఖర్చు చేయడం జరిగిందని, భూమి ప్లాట్ తో కలిపి 10 పది లక్షల ఖర్చు అవుతుందని ఒక్క ఫ్లాట్ విస్తీర్ణం 325 స్క్వేర్ ఫీట్ ఉంటుందని వివరించారు. రూ.75 కోట్లతో అంతర్గత రోడ్లు, ఎలక్ట్రిసిటీ, త్రాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ కొరకు ప్రభుత్వం నుండి మంజూరు చేయించి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నట్లు, అవసరమైతే రాత్రి, పగలు కూడ ఎక్కువ పనివారిని పెట్టి మార్చి మొదటి వారం కల్లా పెండింగ్ పనులు పూర్తి చేయడం జరుగుతుందని, వెల్లడించారు. మార్చి మొదటి వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మొదటి విడతలో హుజూర్నగర్ లోకల్ లో ఇండ్లు లేని వారికి, నిరుపేదలు, తెల్ల రేషన్ కార్డు కలిగిన 1000 మంది లబ్ధిదారులకు పంపిణీ చేయుటకు ఏర్పాట్లు చేస్తున్నామని ప్రకటించారు. రెండవ విడతలో హుజూర్నగర్ నియోజకవర్గంలోని పేదలకు అందించడం జరుగుతుందని ఎంపిక ప్రక్రియలో ఆర్డిఓ, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో తాసిల్దార్ లు పారదర్శకంగా నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆదేశించారు. ఎంపిక విషయంలో ఎలాంటి అవినీతికి, అవకతవకలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు, ఈ విలేకరుల సమావేశంలో ఎస్పీ కే నరసింహ, మున్సిపల్ చైర్ పర్సన్ దొంతగాని శ్రీనివాస్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్, మార్కెట్ కమిటీ చైర్మన్, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, ఆర్టికల్చర్ పిడి నాగయ్య, ఇతర జిల్లా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఊహాలు గల్లంతేనా...?!

ఇప్పట్లో జడ్పిటిసి ఎన్నికలు జరిగేనా

పినపాకలో ఆశావహుల ఎదురు చూపు

అక్షర కలం/పినపాక:




'పిల్లే పుట్టలేదు ఏ కుల్లా కుట్టిద్దాం'అనే పరిస్థితి కొందరి హడావిడి చూస్తే విస్మయం కలిగిస్తోంది.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు లో కొందరు నాయకుల హడావుడి మండలంలోని ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. జడ్పిటీసీ ఎన్నికల్లో అధికార పార్టీ నుంచి నేనే గెలుస్తానని ఒకరు..లేదు నేనే గెలుస్తానని మరొకరు ఇలా ఎవరికి వారు పోటీ పడుతున్న నేపథ్యంలో అసలు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తారా లేదా అన్నది చూడాల్సిన పరిస్థితి నెలకొంది.ఈ ఎన్నికల్లో బీ ఫాం ఇవకున్నా స్వతంత్ర అభ్యర్థిగానైనా పోటీచేసి గెలుస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నారు కొందరు.ఈ సందర్భంగా చిన్నాచితక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ బిజీగా ఉన్నారు.,మండలంలో ఓటర్లకు గుర్తుగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.. ఎన్నికల నోటిఫికేషన్ తొందరలోనే వస్తుందని ప్రజల్లోకి చొచ్చుకుని వెళు_న్నారు.అయితే బీసీ రిజర్వేషన్ 42% తెలంగాణ ప్రభుత్వం ప్రకటించినప్పటి గణాంకాల ప్రకారం వినుపాక నియోజకవర్గం లో ఐదు మండలాలు కొత్తగా ఏర్పడ్డ రెండు మండలాల్లో ఆళ్ల పెల్లి బీసీ గుండాల ఓసి,మిగతా పినపాక, కరకగూడెం మణుగూరు అశ్వాపురం బూర్గంపాడు మండలాలలో ఎస్టీ రిజర్వేషన్ కేటాయించినట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే పినపాక నియోజకవర్గం లో పట్టుకొమ్మలాంటి మండలం మణుగూరు కూడా ఎస్టీ రిజర్వేషన్ కావడం తో ఊహల పల్లకిలో ఊరేగే ఓసి,బిసి అభ్యర్థుల ఊహాలు ఒక విధంగా గల్లంతయినట్లే. జడ్పిటిసి ఎన్నికల్లో ఇదే తంతు కొనసాగితే పార్టీలను నమ్ముకున్న వారి సంగతి అలాగే పదవీ వ్యామోహంతో పలు రకాల కార్యక్రమాలు చేపడుతున్న ఇతర పార్టీ నాయకుల భవిష్యత్తు,రెబల్ అభ్యర్థుల దారి ఎటువైపు అన్నది ప్రశ్నార్థకంగా మరే పరిస్థితి ఉంది.ఏది ఏమైనా అధికార పార్టీ హైకమాండ్ మాత్రం పార్టీని నమ్ముకుని ఉన్న కార్యకర్తలను వమ్ము చేయకుండా జడ్పిటిసి ఎన్నికలు జరగక పోయినా జిల్లాలో నామినేట్ పోస్టులు ఇవ్వొచ్చనే ప్రచారం జరుగుతోంది.

## కమనీయం తిరుమలనాథ స్వామి వారి కళ్యాణ

కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం

అక్షర కలం ; చిట్యాల



నల్గొండ జిల్లా చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలో గురువారం రోజున శ్రీ భూ సమేత తిరుమలనాధ స్వామి వారి కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామీణ సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు దోహదపడతాయని అన్నారు. నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలిగి ఉండాలని ఆయన ప్రార్థిస్తు గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం గ్రామాస్తుడు పున్న రాములు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఓర్సు రాజకుమార్, గ్రామ సర్పంచ్ కాటం వెంకటేశం, ఉప సర్పంచ్ ఓర్సు సైదులు, ఆలయ ధర్మకర్తలు ఏర్పుల యాదమ్మ నరసింహ, చల్లమల్ల మధుసూదన్ రెడ్డి, జెల్ల నరసింహ, సాపిడి యాదగిరి, మాజీ సర్పంచ్ జలంధర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ముద్దసాని నీత రమణారెడ్డి, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## టిడబ్ల్యూజేఎఫ్ 2026 మీడియా డైరీ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్, రామగుండం సిపి

మంచిర్యాల, ఫిబ్రవరి 26 అక్షర కలం:





తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్ ) ప్రతిష్టాత్మకంగా రూపొందించిన 2026 నూతన సంవత్సర మీడియా డైరీని గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్ పాల్గొని డైరీని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మిట్టపల్లి మధు, జిల్లా కార్యదర్శి సత్య గౌడ్ లు డైరీలో పొందుపరిచిన విశేషాలను అధికారులకు వివరించారు. ప్రభుత్వ విభాగాలు, ప్రజాప్రతినిధులు, కీలక సంప్రదింపు వివరాలు, మీడియా రంగానికి అవసరమైన చట్టాలు, మార్గదర్శకాలు, క్యాలెండర్ సమాచారం వంటి అంశాలతో ఈ డైరీని సమగ్రంగా రూపొందించామని వారు తెలిపారు.

## మహాత్మా గాంధీ ముక్త్యాల బ్రాంచి కెనాల్ ఎత్తిపోతల పథకం పనులపై సమీక్షించిన రాష్ట్ర ఆహార పౌరసరఫరాల మరియు నీటిపారుదల శాఖ మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి

సూర్యాపేట అక్షర కలం


1642 కోట్ల రూపాయలతో 45 వేల ఎకరాలకు సాగునీరు అందించే మహాత్మా గాంధీ ముక్త్యాల బ్రాంచి కెనాల్ ఎత్తిపోతల పథకం పనులను గురువారం రాష్ట్ర ఆహార పౌరసరఫరాల మరియు నీటిపారుదల శాఖ మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి సందర్శించి అనంతరం ప్రాజెక్టు పూర్వ గదిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 1642 కోట్ల రూపాయలతో 45 వేల ఎకరాలకు సాగునీరు అందించే మహాత్మా గాంధీ ముక్త్యాల బ్రాంచి కెనాల్ ద్వారా 3 మండలాల్లోని 23 గ్రామాలకు తాగునీరు అందించడం జరుగుతుందని, మట్టపల్లి మండలంలో 9 గ్రామాలు, చింతలపాలెం మండలంలో 5 గ్రామాలు, మేళ్లచెరువు మండలంలో 9 గ్రామాలు మొత్తం 23 గ్రామాలకు సాగునీరు అందుతుందని, 16 మెగావాట్ల 4 పంపుసెట్ల ద్వారా 160 మీటర్ల లోతు నుండి వీటిని అందించడం జరుగుతుందని, ఇందుకుగాను 198 ఎకరాలు భూసేకరణ చేసి, రైతులకు 53 కోట్లు చెల్లించనైనదని వచ్చే సెప్టెంబర్ నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి సాగునీరు అందించడం జరుగుతుందని మంత్రి అన్నారు.ఈ కార్యక్రమంలో నీటిపారుదల ఎస్సీ నాగభూషణం, కాంట్రాక్టర్లు, పాల్గొన్నారు.





అక్షరకలం
తెలుగు దినపత్రిక

## ఆట



# జింబాబ్వేతో మ్యాచ్‌లో రింకూ సింగ్ అనుమానమే!

ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026లో ఇండియా ముందున్న తొలి సవాల్ జింబాబ్వే. ఫిబ్రవరి 26న చెన్నైలోని ఎం.ఏ. చిదంబరం స్టేడియంలో భారత్, జింబాబ్వే జట్లు తలపడనున్నాయి. సూపర్–8లో ఒక ఓటమి తర్వాత భారత్‌కు ప్రతి మ్యాచ్ 'డూ ఆర్ డై' లాంటిదే. దాంతో గురువారం జరగనున్న ఈ మ్యాచ్ టీమిండియాకు అత్యంత కీలకం కానుంది. దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచులో భారీ తేడాతో ఓటమి చెందడం జట్టుకు మైనస్ అయింది. ఇదే సమయంలో భారత జట్టుకు మరో షాక్ తగిలింది. బ్యాటర్ రింకూ సింగ్ ఫ్యామిలీ ఎమర్జెన్సీ కారణంగా జట్టుకు తాత్కాలికంగా దూరమయ్యాడు. రింకూ తండ్రి ఆరోగ్యం విషమంగా ఉందని, ఆయనను ఆసుపత్రిలో చేర్పించినట్లు సమాచారం. లివర్ ప్రాబ్లమ్ తో హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న తండ్రిని చూసేందుకు, కుటుంబానికి మద్దతుగా నిలిచేందుకు రింకూ సింగ్ తన స్వస్థలానికి వెళ్లిపోయాడు. దాంతో జింబాబ్వేతో జరిగే మ్యాచ్‌లో రింకూ ఆడటం అనుమానమే. అయితే అతడి స్థానంలో జట్టులోకి ఎవరు వస్తారు అనేదానిపై చర్చ జరుగుతోంది. ఈ మ్యాచ్‌కు రింకూ సింగ్ అందుబాటులో లేకపోతే, కచ్చితంగా అక్షర్ పటేల్ అతడికి ప్రత్యామ్నాయం కావచ్చు. దాంతో పాటు బౌలింగ్ కూడా చేస్తాడు. చెన్నై పిచ్ సాధారణంగా స్పిన్ బౌలర్లకు సహకరిస్తుంది. కనుక ఈ పరిస్థితిలో అక్షర్ జట్టుకు అదనపు స్పిన్ ఆప్షన్‌గా మారతాడు. అక్షర్‌ను జట్టులోకి తీసుకుంటే భారత్ నలుగురు ఆల్‌రౌండర్లతో (శివం దూబే, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్) బరిలోకి దిగవచ్చు. దీనివల్ల బ్యాటింగ్ డెప్త్ పెరగడమే కాకుండా బౌలింగ్‌లోనూ బ్యాలెన్స్ వస్తుంది. జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ ఫాస్ట్ బౌలింగ్ బాధ్యతల్ని కొనసాగిస్తారు. వారికి పాండ్యా తోడవుతాడు. రింకూ లేకపోతే రెండవ ప్రత్యామ్నాయం సంజూ శాంసన్. సంజూ దూకుడుగా ఆడే బ్యాటర్. అవసరమైతే ఇన్నింగ్స్ ప్రారంభించగల ప్లేయర్. మిడిల్ ఆర్డర్‌లో కూడా బ్యాటింగ్ చేస్తాడు. టీమ్ మేనేజ్మెంట్ బ్యాటింగ్‌ను మరింత బలోపేతం చేయాలనుకుంటే ఈ మ్యాచులో సంజూకు అవకాశం ఇవ్వవచ్చు. దీనివల్ల భారీ షాట్లు ఆడగల అదనపు బ్యాటర్ భారత్‌కు అందుబాటులోకి వస్తాడు. భారత్‌కు ఈ మ్యాచ్ కేవలం మరో లీగ్ మ్యాచ్ మాత్రమే కాదు, సెమీఫైనల్ ఆశలు సజీవంగా నిలవాలంటే భారీ విజయంతో నెగ్గాలి. నెట్ రన్ రేట్‌ను మెరుగుపరుచుకోవడానికి భారీ తేడాతో గెలవాల్సి ఉంటుంది. అయితే బీసీసీఐ మేనేజ్ మెంట్ బ్యాటింగ్ బలాన్ని నమ్ముకుంటుందా, లేక ఆల్ రౌండర్ అక్షర్ ను జట్టులోకి తీసుకుంటుందా ఇప్పుడే చెప్పలేం. కానీ జింబాబ్వేపై సూర్యకుమార్ సేన అద్భుత విజయాన్ని సాధిస్తే ఆశలు సజీవంగా ఉంటాయి.




# ఒత్తిడిలో ఉన్న భారత్‌ను ఓడిస్తాం

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో వరుస విజయాలతో జోరు మీదున్న టీమిండియా.. అసలు సిసలు పోరుకు సిద్ధమైంది. సూపర్–8లో భాగంగా ఆదివారం సౌతాఫ్రికాతో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. ఆదివారం అహ్మదాబాద్ వేదికగా రాత్రి 7.30 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. అయితే ఈ మ్యాచ్ నేపథ్యంలో తమ కంటే భారత్‌పైనే ఒత్తిడి ఎక్కువగా ఉందని సౌతాఫ్రికా హెడ్ కోచ్ షుక్రి కాన్రాడ్ అన్నాడు. ఈ మ్యాచ్ నేపథ్యంలో శనివారం మీడియాతో మాట్లాడిన షుక్రి కాన్రాడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత్ మీదే ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని చెప్పాడు. ఒత్తిడిలో ఏ జట్టు అయినా బలహీనపడుతుందని, దాన్ని క్యాష్ చేసుకొని విజయం సాధిస్తామని పేర్కొన్నాడు.'భారత్ మీదే ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. సెమీఫైనల్స్ చేరుకునే విషయంలో టీమిండియాపైనే అంచనాలు ఎక్కువగా ఉన్నాయి. వారు ఫైనల్‌కు కూడా చేరుకుంటారు. అయితే ఒత్తిడిలో వారు బలహీనపడుతారు. దాన్ని క్యాష్ చేసుకుంటాం. నిజానికి మా ఇరు జట్ల మీదా ఒత్తిడి ఉంటుంది.మేమంతా అత్యుత్తమ జట్టుతో మ్యాచ్ ఆడితే ఉండే ఒత్తిడి గురించి మాట్లాడుతున్నాం. నిజానికి వారు ఏ ఒత్తిడిలో ఉన్నారో తెలియదు. అభిషేక్ శర్మ ఆడిన మూడు మ్యాచ్‌ల్లో వరుసగా డకౌట్ అయిన వ్యక్తి, జట్టులో తన స్థానం గురించి పడే ఒత్తిడి గురించి నేను మాట్లాడటం లేదు.'అని షుక్రి కాన్రాడ్ పేర్కొన్నాడు. మూడు మ్యాచ్‌ల్లో డకౌట్ అయినా అభిషేక్ శర్మకు టీమిండియా మేనేజ్‌మెంట్ అండగా నిలుస్తోంది. అతను వరల్డ్ నెంబర్ వన్ బ్యాటర్ అని, కీలక సమయంలో తప్పకుండా ఫామ్ అందుకుంటాడని ఆశాభావం వ్యక్తం చేస్తోంది. గతేడాది చివర్లో సౌతాఫ్రికా జట్టు భారత్‌లో పర్యటించింది. ఈ సందర్భంగా ఐదు టీ20ల సిరీస్‌ను టీమిండియా 3–1తో గెలిచింది. ఈ సిరీస్‌లో ఒక మ్యాచ్ వర్షం కారణంగా తుడిచి పెట్టుకుపోయింది. అయితే ద్వైపాక్షిక సిరీస్ ఫలితాలు ప్రపంచకప్ పోరుకు ఏ మాత్రం ప్రామాణికం కావని షుక్రి అన్నాడు. ఈ క్రమంలోనే భారత్, సౌతాఫ్రికా మధ్య జరిగే సూపర్–8 పోరు హోరా హోరీగా ఉంటుందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కేశవ్ మహారాజ్, జార్జ్ లిండేతో సౌతాఫ్రికా స్పిన్ విభాగం, క్వింటన్ డికాక్, ర్యాన్ రికెల్టన్, ఐడెన్ మార్క్‌రమ్, ట్రిస్టన్ స్టబ్స్ బ్యాటింగ్ దళం బలంగానే కనిపిస్తోంది.

# సచిన్ విషయంలో తప్పు చేశాను

క్రికెట్ చరిత్రలో అత్యంత వివాదాస్పద నిర్ణయాలలో ఒకటి మరోసారి హాట్ టాపిక్ అవుతోంది. అందుకు కారణం సచిన్ విషయంలో తాను తప్పు చేశానని అంపైర్ స్టీవ్ బక్నర్ స్వయంగా అంగీకరించారు. 2003–04 ఆస్ట్రేలియా పర్యటనలో బ్రిస్బేన్ టెస్టులో క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్‌ను స్టీక్ బక్నర్ ఎల్బీడబ్ల్యూ అవుట్‌గా ప్రకటించిన ఘటన అభిమానులకు నేటికీ గుర్తుంది. అయితే 22 ఏళ్ల తర్వాత ఆ మ్యాచ్ అంపైర్ స్టీవ్ బక్నర్ తొలిసారిగా సచిన్ ఎల్బీడబ్ల్యూ నిర్ణయం తప్పని బహిరంగంగా అంగీకరించారు. 79 ఏళ్ల బక్నర్ చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. ఆ రోజు బంతి స్టంప్స్‌ను తాకడం లేదని, తాను సచిన్‌ను ఔట్ ఇచ్చి ఉండాల్సింది కాదన్నారు. ఆయన చేసిన ఈ ప్రకటనతో రెండు దశాబ్దాలుగా పలుమార్లు కొనసాగిన చర్చకు తెరపడింది. జీవితంలో కొన్ని తప్పులు జరుగుతాయని, సచిన్ విషయంలో తాను చేసిన తప్పును అంగీకరిస్తున్నానని బక్నర్ స్పష్టం చేశారు. 2003–04లో బ్రిస్బేన్‌లో జరుగుతున్న టెస్ట్ మ్యాచ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ జాసన్ గిలెస్పీ వేసిన ఒక బంతిని సచిన్ వదిలేయడానికి ప్రయత్నించాడు. ఆ క్రమంలో బంతి సచిన్ ప్యాడ్లకు తగిలింది. ఆస్ట్రేలియా ఆటగాళ్లు గట్టిగా అప్పీల్ చేయడంతో అంపైర్ స్టీవ్ బక్నర్ ఆ అప్పీల్‌ను అంగీకరిస్తూ వేలెత్తి సచిన్‌ను ఔట్ అని ప్రకటించారు. ఆ సమయంలో సచిన్ కేవలం 3 పరుగుల వద్ద బ్యాటింగ్ చేస్తున్నాడు. తరువాత టీవీ రిప్లేలో బంతి స్టంప్స్ పైనుంచి వెళ్తున్నట్లు స్పష్టంగా కనిపించింది. కామెంటరీ బాక్స్‌లో ఉన్న దిగ్గజ వ్యాఖ్యాత టోనీ గ్రేగ్ కూడా దీనిని చెత్త నిర్ణయంగా పేర్కొన్నారు. ఇది చాలా దారుణమైన నిర్ణయం. నిర్ణయం తీసుకునే ముందు బంతి లైన్, బౌన్స్‌ను అంపైర్ బక్నర్ గమనించి ఉండాల్సింది అని ఆయన వ్యాఖ్యానించారు. ఆ రోజుల్లో డిఆర్ఎస్ వ్యవస్థ అందుబాటులో లేదు. అందువల్ల అంపైర్ నిర్ణయమే ఫైనల్ అని భావించేవారు. ఈ ఒక్క నిర్ణయం క్రికెట్ ప్రపంచంలో పెద్ద వివాదాన్ని సృష్టించింది. సచిన్‌కు వ్యతిరేకగా బక్నర్ గతంలో కూడా తప్పుడు నిర్ణయాలు తీసుకున్నారని చాలా మంది భారత అభిమానులు నమ్మేవారు. బ్రిస్బేన్ టెస్ట్ లాంటి ఎన్నో ఘటనల్ని టీమిండియా ఫ్యాన్స్ ఎన్నటికీ మరిచిపోరు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక




# విరోష్ ప్రీమియర్ లీగ్ సెలబ్రేషన్స్

ఫిబ్రవరి 26న గురువారం విజయ్ దేవరకొండ, రష్మిక వివాహబంధంలోకి అడుగుపెట్టనున్నారు. తాజాగా ఈ తేదీని అధికారికంగా ప్రకటించారు. మంగళవారం మెహందీ, సంగీత్ సందడిగా జరిగినట్లు తెలుస్తోంది. సంగీత్‌లో విజయ్, రష్మిక కలిసి నటించిన సినిమాల్లోని ఫొటోలు, వీరి ప్రేమకథ ఫ్రేమ్‌లతో డెకరేషన్ చేశారు. ప్రస్తుతం ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఫొటోలను అధికారికంగా షేర్ చేయాలని కోరుతూ అభిమానులు వీరిద్దరినీ ట్యాగ్ చేస్తున్నారు. సంగీత్‌లో భాగంగా ఇరు కుటుంబాలు సరదాగా 'విరోష్ ప్రీమియర్ లీగ్'ను సెలబ్రేట్ చేసుకున్నారు. దీనికి సంబంధించిన ఫొటోను విజయ్ దేవరకొండ తన ఇన్‌స్టాలో పంచుకున్నారు. క్రికెట్ బ్యాట్, సిల్వర్ మెడల్‌పై ఫిబ్రవరి 26 అని రాసి ఉండడంతో పెళ్లి తేదీని ఇలా డిఫరెంట్‌గా ప్రకటించారని అభిమానులు సంబరపడుతున్నారు. ఈరోజు హల్దీ వేడుక జరగనుంది. ఉదయ్‌పుర్‌లోని మెమెంటోస్ హోటల్‌లో జరగనున్న వీరి పెళ్లికి ఇండస్ట్రీలోని ప్రముఖులతో పాటు వ్యాపారవేత్తలు కూడా హాజరుకానున్నారు. దీంతో ఉదయపుర్ విమానాశ్రయం అతిథులతో కళకళలాడుతోంది. తరుణ్ భాస్కర్, రాహుల్ రవీంద్రన్, ఈషా, శ్రావ్యా వర్మ, ఆషిక రంగనాథ్, అనిల్ అంబానీలతో పాటు మరికొందరు సెలబ్రిటీలు ఎయిర్‌పోర్ట్‌లో కనిపించారు.



# చదువులో ఇద్దరూ ఇద్దరే

టాలీవుడ్ ప్రేమజంట విజయ్ దేవరకొండ– రష్మిక మంధాన ఫిబ్రవరి 26న పెళ్లి బంధంలోకి అడుగు పెట్టబోతున్నారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ లో వీరి వివాహ వేడుకలు జరుగుతున్నాయి. ఇప్పటికే కుటుంబ సభ్యులు, సన్నిహితులతో కలిసి ఈ జంట అక్కడికి చేరుకుంది. ఈ నేపథ్యంలో వీరిద్దరి వ్యక్తిగత జీవితం, ముఖ్యంగా విద్యాభ్యాసానికి సంబంధించిన ఆసక్తికర విషయాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సినిమాల్లోకి రాకముందు విజయ్, రష్మిక ఇద్దరూ తమ చదువును పూర్తి చేసి తర్వాతే ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. విజయ్ దేవరకొండ తొలుత హైదరాబాద్‌లోని లోకల్ స్కూల్‌లో చదివారు. ఆ తర్వాత పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి హయర్ సెకండరీ స్కూల్లో హాస్టల్‌లో ఉంటూ 10వ తరగతి వరకు చదివారు. అనంతరం హైదరాబాద్‌లోని లిటిల్ ఫ్లవర్ జూనియర్ కాలేజ్‌లో ఇంటర్ పూర్తి చేశారు. తర్వాత హైదరాబాద్‌లోని భద్రుక కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో కామర్స్ డిగ్రీ చేశారు. డిగ్రీ పూర్తయ్యాకే సినిమా రంగంలోకి అడుగుపెట్టారు. మొదట క్యారెక్టర్ ఆర్టిస్టుగా పలు చిత్రాల్లో




నటించి, తరువాత 'పెళ్లిచూపులు' సినిమాతో హీరోగా గుర్తింపు పొందారు. ఇక రష్మిక మందన్న మొదట కూర్గ్ పబ్లిక్ స్కూల్‌లో చదువుకున్నారు. ఆ తర్వాత గొనికొప్పలోని స్కూల్‌లో స్కూల్ ఎడ్యుకేషన్ పూర్తి చేశారు. అనంతరం బెంగుళూరులోని ఎంఎస్ రామయ్య కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ స్టైన్స్ అండ్ కామర్స్ లో సైకాలజీ, జర్నలిజం, ఇంగ్లీష్ లిటరేచర్‌లో డిగ్రీ చేశారు. కాలేజీ రోజుల నుంచే మోడలింగ్ ప్రారంభించిన రష్మిక, తరువాత కన్నడ చిత్రం కిరిక్ పార్టీతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు. ఆ సినిమా సక్సెస్‌తో దక్షిణాది ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. ఇలా విజయ్ ? రష్మిక ఇద్దరూ డిగ్రీ పూర్తిచేసి తర్వాతే సినిమాల్లోకి వచ్చారు. ప్రస్తుతం టాలీవుడ్, బాలీవుడ్‌లో వరుస ప్రాజెక్టులతో స్టార్ హోదాలో కొనసాగుతున్నారు. ఇప్పుడు పెళ్లి బంధంతో ఒకటవుతున్న ఈ జంటకు అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతూ, వారి వెడ్డింగ్ ఫోటోల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. చదువులోనూ మెరుపులు మెరిపించిన ఈ స్టార్ కపుల్? జీవితంలోనూ సక్సెస్ ఫుల్ జర్నీ కొనసాగించాలని ఫ్యాన్స్ ఆకాంక్షిస్తున్నారు.

# కొత్త తిరుపతిని చూస్తారు: దర్శకుడు అజయ్ భూపతి

'ఆర్ఎక్స్ 100', 'మంగళవారం' వంటి వైవిధ్యభరితమైన చిత్రాలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు అజయ్ భూపతి, ఇప్పుడు తన తదుపరి చిత్రం 'శ్రీనివాస మంగాపురం' తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. అయితే ఈ సినిమా గురించి ఆసక్తికరమైన అప్‌డేట్‌ను పంచుకున్నాడు దర్శకుడు అజయ్. ఈ సినిమా ద్వారా ప్రపంచానికి తెలిసిన ఆధ్యాత్మిక కేంద్రం తిరుపతిలోని మరో కోణాన్ని, ఇప్పటివరకు ఎవరూ చూడని సరికొత్త పార్శ్వాన్ని ప్రేక్షకులకు పరిచయం చేయబోతున్నట్లు ఆయన ప్రకటించారు. మీరు ఇప్పటివరకు చూడని తిరుపతిని చూపిస్తాను.. సిద్ధంగా ఉండండి' అంటూ ఆయన చేసిన పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రం ద్వారా సూపర్ స్టార్ కృష్ణ మనవడు జయకృష్ణ ఘట్టమనేని టాలీవుడ్‌కు హీరోగా పరిచయం అవుతుండటం విశేషం. ఆయన సరసన ప్రముఖ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ క్రేజీ ప్రాజెక్టును వైజయంతీ మూవీస్, స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్స్ మరియు సి.కె. పిక్చర్స్ వంటి దిగ్గజ నిర్మాణ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం తిరుపతి నేపథ్యంలో అజయ్ భూపతి శైలిలో ఎంత 'రా' అండ్ 'రస్టిక్'గా ఉండబోతుందో అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# చీకటిని చీల్చి జ్ఞానజ్యోతిని వెలిగిద్దాం

**దృష్టి లోపం ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేక సదుపాయాలు**

**2026 -27 వార్షిక బడ్జెట్‌కు ఆమోదం**

**గ్రంథాలయాల అభివృద్ధికి చైర్మన్ ఎం.ఏ. ఆఫీజ్ ఖాన్ పిలుపు**

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం



జిల్లాలో పప్రథమంగా బ్లైండ్ విద్యార్థుల కై ప్రత్యేక డిజిటల్



లైబ్రరీ కార్నర్ సదుపాయాలను నల్గొండ జిల్లా గ్రంథాలయంలో ప్రారంభించడం గర్వకారణమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం ఏ ఆఫీజ్ ఖాన్ తెలిపారు. గురువారం నల్గొండ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బ్లైండ్ (దృష్టి లోపం ఉన్న) పాఠకులు,విద్యార్థుల కై ప్రత్యేక డిజిటల్ లైబ్రరీ కార్నర్ ను ఆయన ప్రారంభించారు. విద్య అందరికీ సమానంగా అందుబాటులో ఉండాలని,ఇందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు.బ్లైండ్ విద్యార్థుల కు ఏర్పాటు చేసిన సదుపాయాలు,బ్రెయిలి పుస్తకాలు, ఆడియో బుక్స్, ఈ-బుక్స్‌స్క్రీన్ రీడర్ సాఫ్ట్‌వేర్‌తో కూడిన కంప్యూటర్లు,ప్రత్యేకంగా చదువుకునే విభాగంసహాయక సాంకేతిక పరికరాలలు ఉపయోగించుకోవాలని చెప్పారు. అనంతరం 2026 --27 సంవత్సరానికి సంబంధించిన జిల్లా గ్రంథాలయ సంస్థ వార్షిక బడ్జెట్ సమావేశం గ్రంథాలయ సంస్థ చైర్మన్ అధ్యక్షతన జరిగింది. 2026 --27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌కు సమావేశం ఆమోదం తెలిపింది. ఈ బడ్జెట్ ద్వారా గ్రంథాలయాల అభివృద్ధి, పుస్తకాల కొనుగోలు, భవనాల మరమ్మతులు, డిజిటల్ లైబ్రరీ విస్తరణ, భద్రతా చర్యలు వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు.జిల్లాలో అవసరమైన చోట పబ్లిక్ రీడింగ్ సెంటర్లు ప్రారంభిస్తామన్నారు. గ్రామ పంచాయతీలు,ముని స్పాలిటీలు గ్రంథాలయ సెస్ ను సకాలంలో చెల్లించాల న్నారు .జిల్లాలోని ప్రతి గ్రంథాలయాన్ని సమగ్ర జ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని చైర్మన్ స్పష్టం చేశారు. విద్యార్థులు, పాఠకులు గ్రంథా లయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కార్య దర్శి బాలమ్మ, అనిల్ కుమార్, కృష్ణ, మోహన్, నరసింహారెడ్డి గ్రంథాలయ అధికారులు పాల్గొన్నారు.

## వాహనదారులు పెట్రోల్ బంక్‌ని సద్వినియోగం చేసుకోవాలి

**-బుర్రి శ్రీనివాస్ రెడ్డి**



అక్షరకలం నల్గొండ

గ్రామీణ ప్రాంతంలో ఏర్పాటు చేసిన గ్రీన్ పాత్ పెట్రోల్ బంక్ ను వాహనదారులు, టాక్టర్ ద్వారా వ్యవసాయం చేస్తున్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి లు సూచించారు. నల్లగొండ మండలంలోని చందనపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రీన్ పెట్రోల్ బంకును వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. అనంతరం అయన మాట్లాడుతూ వాహనదారులు, వ్యవసాయదారులు పెట్రోల్, డీజిల్ కోసం పట్టణాలు వెళ్లకుండా గ్రామంలోనే పెట్రోల్ బంకును ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ముఖ్యంగా వ్యవసాయదారులు పెట్రోల్, డీజిల్ కోసం గతంలో నల్లగొండకు వెళ్లేవారని కానీ ప్రస్తుతం గ్రామంలోనే పెట్రోల్ బంకును ఏర్పాటు చేయడం ద్వారా వ్యవసాయ పనులకు అంతరాయం కలగకుండా ఇక్కడే పెట్రోల్ కొనుగోలు చేసుకుని తమ పనులు చేసుకోవచ్చని అన్నారు. వాహనదారులకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందించి ప్రజల మన్ననలు పొందాలని అదేవిధంగా 24 గంటలు పెట్రోల్ బంకు అందుబాటులో ఉండాలని సూచించారు.ఈ అవకాశాన్ని చందనపల్లి గ్రామంతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి వంగూరు లక్ష్మయ్య, చందనపల్లి గ్రామ సర్పంచ్ పెద్ది లక్ష్మీ గోవర్ధన్, ఉప సర్పంచ్ ఉప్పుల మురళి, బంక్ ప్రొప్రైటర్ తంగెళ్ల సత్తిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు కత్తుల కోటి, తంగెళ్ల అనంతరెడ్డి, పెద్ది గోపాల్, సురిగి రమేష్, పాలడుగు బిక్షం, రవీందర్ రెడ్డి, రమేష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తంగేళ్ల వెంకట్ రెడ్డి, పాలడుగు బిక్షం, ఉప్పుల జానీ, లింగయ్య, గద్దల నాగయ్య, బండ చిన్న పిచ్చిరెడ్డి, తదితరులు ఉన్నారు.

## యాదాద్రి భువనగిరి జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ గా వెంకారెడ్డి



యాదాద్రి భువనగిరి అక్షర కలం

యాదాద్రి భువనగిరి జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ గా వెంకారెడ్డి గురువారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో అదనపు కలెక్టర్ గా పదవి బాధ్యతలు స్వీకరించారు. శేరిలింగంపల్లిలో డిప్యూటీ కలెక్టర్ గా మరియు తహసిల్దార్ పనిచేస్తున్న వెంకారెడ్డి బదిలీ పై యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా వచ్చారు.

## యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌గా అనురాగ్ జయంతి

యాదాద్రి భువనగిరి అక్షరకలం

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ గా అనురాగ్ జయంతి గురువారం కలెక్టరేట్ లోని కలెక్టర్ చాంబర్ లో బాధ్యతలు స్వీకరించారు. 2015 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన అనురాగ్ జయంతి తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా నూతన కలెక్టర్ గా నియమితులయ్యారు.గతంలో అనురాగ్ జయంతి భోధన్, ఖమ్మం జిల్లాలో సబ్ కలెక్టర్ గా, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గా, జీహెచ్ఎంసీ పరిధిలోని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ గా, ప్రస్తుతం రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్‌గా విధులు నిర్వహించి బదిలీ పై యాదాద్రి భువనగిరి జిల్లా కు వచ్చారు.ఇప్పటివరకు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు నిర్వర్తించిన హన్మంతరావు దేవదాయ శాఖ డైరెక్టర్‌గా బదిలీ పై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన కలెక్టరేట్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ విద్యా, వైద్య రంగాలతో పాటు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు అధిక ప్రాధాన్యత ఇస్తానని అన్నారు.



## మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ లను సన్మానించిన గోలి దంపతులు





అక్షర కలం బీబీనగర్

యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని భువనగిరి మున్సిపల్ చైర్మన్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన తంగెళ్ళపల్లి శ్రీవాణి, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల లను బీబీనగర్ కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గోలి పింగల్ రెడ్డి, గోలి ప్రణీత దంపతులు గురువారం ఘనంగా సన్మానించారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో భువనగిరి మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా, అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాలని వారు నూతన చైర్మన్, వైస్ చైర్మన్ మరియు నూతన కౌన్సిలర్ లను కోరారు.

## పూరి గుడిసె అగ్నిప్రమాదం

**బాధితులకు అండగా ఉంటామన్న ఎమ్మార్వో మధుహాసిని**

అక్షరకలం దేవరకొండ

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సర్వస్వం కోల్పోయిన పేద కుటుంబానికి ప్రభుత్వం తరపున పూర్తి స్థాయిలో అండగా ఉంటామని గుడిపల్లి మండల ఎమ్మార్వో మధుహాసిని హామీ ఇచ్చారు. బుధవారం ఘన్ పల్లి గ్రామంలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో అలేటి బిక్షం దంపతులకు చెందిన సుమారు రూ. 10 లక్షల నగదు, మూడు తులాల బంగారం అగ్నికి ఆహుతైన విషయం తెలిసిందే.

**ఘటనా స్థలాన్ని పరిశీలించిన రెవెన్యూ బృందం...**

ప్రమాద వార్త తెలుసుకున్న ఎమ్మార్వో మధుహాసిని గారు వెంటనే తన సిబ్బందితో కలిసి బాధితుల వద్దకు చేరుకున్నారు. కాలి బూడిదైన గుడిసెను, అందులోని సామాగ్రిని పరిశీలించి, నష్ట తీవ్రతను అంచనా వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఒక సామాన్య కుటుంబం తమ ఆస్తిని అమ్ముకుని దాచుకున్న నగదు ఇలా కాలిపోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.నష్టానికి సంబంధించిన పూర్తి



నివేదికను ఉన్నతాధికారులకు పంపి, బాధితులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన గరిష్ట ఆర్థిక సాయాన్ని త్వరగా అందేలా కృషి చేస్తామని ఎమ్మార్వో పేర్కొన్నారు. రెవెన్యూ యంత్రాంగం, స్థానిక ప్రజాప్రతినిధులు కలిసి ఈ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. పాత ఇనుప సామాను వ్యాపారం చేసే అలేటి బిక్షం, మాధవి దంపతులు ఇటీవల తమ ప్లాట్‌ను విక్రయించగా వచ్చిన రూ. 10 లక్షల నగదును ఇంట్లోనే ఉంచారు. బుధవారం మధ్యాహ్నం సంభవించిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల నిముషాల్లోనే మంటలు వ్యాపించి నగదు, 3 తులాల బంగారం, నిత్యావసర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వోతో పాటు గన్ పల్లి గ్రామ సర్పంచ్ గుడారి వెంకటేశ్వర్లు, ప్రముఖ నాయకులు కాశ్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామచంద్రనాయక్, ఆర్.ఐ సత్యరాజ్ పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ భాస్కర్ రావు.



యాదాద్రి భువనగిరి అక్షర కలం

యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని టైమ్స్ జూనియర్ కళాశాల మరియు శ్రీ చైతన్య కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను గురువారం అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ఆకస్మిక తనిఖీ చేసారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా పరీక్షల నిర్వహణ, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, ప్రశ్నాపత్రాల పంపిణీ విధానం తదితర అంశాలను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల పని తీరు, తాగునీరు, విద్యుత్, విద్యార్థులు కూర్చునే ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇన్విజిలేటర్లు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి మాల్ప్రాక్టీస్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. నిబంధనల ప్రకారం పరీక్షలను నిర్వహించాలని, విద్యార్థులందరూ ఒత్తిడి లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు వ్రాయాల న్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్ పర్సన్ గా బాధ్యతలు స్వీకరించిన కూన వనిత సంతోష్

**కార్యక్రమానికి హాజరైన**

**టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి**

సంగారెడ్డి ప్రతినిధి,అక్షర కలం..

సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ గా కూన వనిత సంతోష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి హాజరయ్యారు. చైర్మన్ ఛాంబర్ లో పూజ కార్యక్రమాలు నిర్వహించి తదుపరి కుర్చీలో ఆసీనులు అయ్యారు. ఈ సందర్భంగా సి డి సి చైర్మన్ రామ్ రెడ్డి, పిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత కిషన్, బ్లాక్ ప్రెసిడెంట్ రఘు, కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి,సంగారెడ్డి పట్టణ కౌన్సిలర్లు, పట్టణంలోని రాజకీయ నాయకులు,పుర ప్రముఖులు,అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ కార్యకర్తలు శుభాకాంక్షలు



తెలియజేశారు. ఈ సందర్భంగా కూన వనిత సంతోష్ మాట్లాడుతూ నాపై నమ్మకం తో చైర్మన్ పదవిని కట్టబెట్టిన పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. సంగారెడ్డి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా పనిచేస్తామని ఆమె హామీ ఇచ్చారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# వైద్య వృత్తిలో మానవత్వం ముఖ్యం

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నల్గొండ మెడికల్ కాలేజీ విద్యార్థులకు రెండు ఏసీ బస్సుల మంజూరు

ఏఐజీ ఆసుపత్రితో పరిశోధనల కోసం త్వరలో ఎంఓయూ

ప్రభుత్వ వైద్య కళాశాల వార్షికోత్సవం అద్వితీ 2026 లో పాల్గొన్న మంత్రి







ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం

డాక్టర్లు తెల్ల కోటుకు పరిమితం కాకుండా, మానవతా దృక్పథంతో పేదలకు వైద్య సేవలందించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురువారం నల్గొండ ప్రభుత్వ వైద్య కళాశాలలో అద్వితీ -2026 పేరున నిర్వహించిన నల్గొండ ప్రభుత్వ వైద్య కళాశాల వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని వృత్తుల కన్నా వైద్య వృత్తి పవిత్రమైనదని అన్నారు. నల్గొండ ప్రభుత్వ వైద్య కళాశాల అన్ని ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేయబడిందని, వైద్య కళాశాలలో చదివే విద్యార్థులు సబ్జెక్టులతో పాటు, మానవత్వాన్ని కూడా నేర్చుకోవాలని, తెల్ల కోటు బాధ్యతకు సింబల్ అని అన్నారు. కళాశాలలో ఏవైనా సమస్యలు ఉంటే తీర్చేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, వైద్య కళాశాల విద్యార్థుల కోసం రెండు ఏసీ బస్సులను మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. నెలలోపు వీటిని మంజూరు చేస్తామన్నారు. ఇటీవలే ఏఐజి ఆసుపత్రి డాక్టర్ నాగేశ్వరరెడ్డిని ప్రభుత్వ వైద్య కళాశాలకు తీసుకురావడం జరిగిందని, నల్గొండ ప్రభుత్వ వైద్య కళాశాలలో చదివిన పి జి విద్యార్థులను పరిశోధన నిమిత్తం తన ఆసుపత్రిలో ప్రతి సంవత్సరం 45 మంది చొప్పున తీసుకునేందుకు అంగీకరించారని, ఇందుకు సంబంధించిన ఎం ఓ యు ను త్వరలోనే కుదుర్చుకోనున్నట్లు ఆయన వెల్లడించారు. నల్గొండ పట్టణంలో వైద్య విద్యనే కాకుండా, చదువుకోసం ప్రతి పేద విద్యార్థికి సహకారం అందిస్తామని, ఇందుకు తమను సంప్రదించాలని, విద్యాభివృద్ధిలో భాగంగా బొట్టు గూడా ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలను, అలాగే ప్రతిక్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేయడం జరిగిందని , పట్టణంలోని మరికొన్ని పాఠశాలలను కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్దుతామని, 900 కోట్ల రూపాయలతో అవుటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తున్నామని, రాబోయే రోజుల్లో నల్గొండను స్మార్ట్ సిటీగా, మోడల్ సిటీగా చేస్తామని తెలిపారు. నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కాబోయే డాక్టర్లు గ్రామాలలో పేద ప్రజలకు సేవలు అందించాలని కోరారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ మాట్లాడుతూ డాక్టర్ వత్తి పవిత్రమైందని, రోగులను చిరునవ్వుతో పలకరించి వారికి వైద్యం చేయాలని సూచించారు. డిప్యూటీ మేయర్ అమీర్ అశ్రఫ్ అలీ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సత్యనారాయణ ,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి ,మాజీ జెడ్పిటిసి గుమ్మల మోహన్ రెడ్డి, డాక్టర్లు ఆయా వైద్య విభాగాల అధిపతులు, తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మేయర్లు వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు.

# కుమ్మెర ఘటనపై చండూరులో రజక సంఘం భారీ నిరసన



అక్షరకలం, చండూరు

నాగర్ కర్నూల్ కుమ్మెర జాతరలో రజక సామాజిక వర్గానికి చెందిన వారిపై జరిగిన అమానుష ఘటనను నిరసిస్తూ చండూరు రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. జాతరలో జరిగిన ఈ సంఘటన అత్యంత దురదృష్టకరమని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఘటనకు కారణమైన నిందితులను వెంటనే గుర్తించి, వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు. అన్యాయం జరిగిన వారికి రజక సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, నిందితులకు కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం బాధ్యత వహించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం సభ్యులు, వివిధ పార్టీల స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కుల పెద్దలు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

# కొండమల్లేపల్లిలో ఇంటి తాళాలు పగలగొట్టి దొంగతనం

నిందితుడి అరెస్ట్, రూ. 50 వేల నగదు స్వాధీనం


అక్షరకలం దేవరకొండ



తాళం వేసి ఉన్న ఇంట్లోకి చొరబడి దొంగతనానికి పాల్పడిన నిందితుడిని కొండమల్లేపల్లి పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుండి దొంగిలించిన నగదులో కొంత భాగాన్ని స్వాధీనంఅ చేసుకున్నారు.పోలీసుల కథనం ప్రకారం.. కొండమల్లేపల్లిలోని వాసవి బజార్‌కు చెందిన కనుమూరి నాగరాజు ఈ ఏడాది జనవరి 12న తన ఇంటికి తాళం వేసి బంధువుల ఊరికి వెళ్లారు. మరుసటి రోజు ఉదయం వచ్చి చూడగా, ఇంటి వెనుక తలుపులు పగలగొట్టి ఉన్నాయి. బీరువాలోని 67,000 రూపాయల నగదు దొంగిలించబడినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో ఈరోజు (ఫిబ్రవరి 26) ఉదయం అంబేద్కర్ సెంటర్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా.. పోలీసులను చూసి తప్పించుకోవడానికి ప్రయత్నించిన ఎస్.కె. బాబా (25) అనే వ్యక్తిని పట్టుకుని విచారించారు. విచారణలో తానే దొంగతనం చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు.

# గుర్తుతెలియని వ్యక్తి మృతి

అక్షర కలం : చిట్యాల




నల్గొండ జిల్లా చిట్యాల పట్టణ శివారులోని 7 హోటల్ సమీపంలో జాతీయ రహదారి 65 పై గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చిట్యాల ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఈ ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి (సుమారు 50) 7 హోటల్ సమీపంలో తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. అని సమాచారం అందిన వెంటనే సంఘటన స్థలాన్ని చేరుకొని విచారించగా మృతిని వద్ద చిరునామాకు సంబంధించిన ఎలాంటి ధ్రువపత్రాలు లభించకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా నిర్ధారణ చేస్తూ కేసు నమోదు చేశామని తెలిపారు. మృతుడు ఒంటిపై నలుపు రంగు స్వెటర్, బ్రౌన్ కలర్ పాయింట్ ధరించి ఉన్నాడు. మృతుని వివరాలు తెలిసినట్లయితే 8712670187, 8712670148 నెంబర్లకు సమాచారం ఇవ్వాల్సిందిగా తెలిపారు.

# మున్సిపల్ వార్డు కౌన్సిలర్ గ ఎన్నికైన పాత్రికేయుడు కోర్లపాటి కిరణ్ ను సన్మానించిన ప్రెస్ క్లబ్ సభ్యులు.

అక్షర కలం / ఇల్లెందు.

ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 22 వ వార్డు నుండి మున్సిపల్ కౌన్సిలర్ గా గెలుపొందిన జర్నలిస్ట్ కొర్లపాటి శివ కిరణ్ ను గురువారం ప్రెస్ క్లబ్ లో జర్నలిస్టులు ఘనంగా సత్కరించారు.పూల దండ వేసి శాలువ కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు గడ్డం వెంకటేశ్వర్లు, బండి రామారావు లు మాట్లాడుతూ ప్రజా పక్షం జర్నలిస్టుగా ప్రజా సమస్యలపై తన కలం తో పోరాడుతున్న కిరణ్ మున్సిపల్ ఎన్నికల్లో వార్డు కౌన్సిలర్ గా గెలుపొందడం అభినందనీయమని అన్నారు.ఒక జర్నలిస్టు కు ప్రజా సమస్యలు వాటి పరిష్కారం పై అవగాహన కలిగివుంటారని,ప్రజాప్రతినిది గా కిరణ్ వార్డు పై పూర్తి అవగాహన కలిగి ఉన్నారని అన్నారు. తోటి మిత్రుడు ప్రజా ప్రతినిధి గా విజయం సాధించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమం లో మాదాసు నర్సి,శోభన్,గుడి వాడ శ్రీనివాస్,శ్రీనివాస్ చారి,ఎల్ శ్రీనివాస్,ఎస్,వేణుగోపాల్,రాజు,మహేష్,దొద్దుకూరి సుమంత్ లు పాల్గొన్నారు.



# రెండో పీఆర్సీని వెంటనే అమలు చేయాలి

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావా రవి డిమాండ్

2023 జూలై నుండి ఫిట్మెంట్ ప్రకటించాలి

పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి




ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం

రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం జాప్యం చేయడం సరికాదని, వెంటనే రెండో వేతన సవరణా సంఘం ( పిఆర్సి) నివేదికను తెప్పించుకుని అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ( టీఎస్ యుటిఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు చావా రవి డిమాండ్ చేశారు. గురువారం నల్గొండ జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఐదేళ్లకు ఒకసారి జరగాల్సిన వేతన సవరణ ఎనిమిదేళ్లు గడుస్తున్నా అమలు కాకపోవడం దారుణమని చావా రవి విమర్శించారు. గత ప్రభుత్వం 30 నెలల కాలయాపన చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే బాటలో నడవడం సరికాదన్నారు. 2023 జూలై 1 నుండి అమలులోకి వచ్చేలా సమంజసమైన ఫిట్మెంట్‌తో రెండో పీఆర్సీని వెంటనే ప్రకటించాలని కోరారు. 2018 నూతన రాష్ట్రపతి ఉత్తర్వులకు అనుగుణంగా ఉపాధ్యాయుల సర్వీసు రూల్స్‌ను రూపొందించాలని, దీనివల్ల విద్యాశాఖలో ఖాళీగా ఉన్న డీఈఓ, డిప్యూటీ ఈఓ, ఎంఈఓ వంటి కీలక పర్యవేక్షణ పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. దీని ద్వారా శాఖలో నెలకొన్న సంక్షోభాన్ని నివారించవచ్చని సూచించారు.? 2024 మార్చి నుండి రిటైర్ అయిన ఉద్యోగుల బకాయిలను, పెండింగ్ డీఏ వాయిదాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసారు. హెల్త్ కార్డుల ద్వారా ఉచిత వైద్యం అందించే నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, అయితే చందా భారాన్ని తగ్గించి తొలిదశలోనే మోడల్ స్కూల్స్, కేజీబీవీ, సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఈహెచ్ఎస్ వర్తింపజేయాలని, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇచ్చేలా ప్రభుత్వం చొరవ చూపాలి. గురుకుల ఉపాధ్యాయులపై బోధనేతర పనుల ఒత్తిడిని తగ్గించాలని, ఆశ్రమ పాఠశాలల సీఆర్టీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం, జిల్లా అధ్యక్షులు బక్కా శ్రీనివాస్ చారి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎడ్ల సైదులు, ఉపాధ్యక్షురాలు బడుగు అరుణ, కోశాధికారి వడిత్య రాజు, జిల్లా కార్యదర్శులు మోర్తాల శ్రీనివాస్ రెడ్డి, నలపరాజు వెంకన్న, చిన వెంకన్న, కొమర్రాజు సైదులు తదితరులు పాల్గొన్నారు.

# నేను వెళ్తున్నా.. "నీకు తోడుగా ఉంటా"

కలెక్టర్ అపురూప వీడ్కోలు

దత్తత తీసుకున్న బాలుడు భరత్ చంద్రకు ఇందిరమ్మ ఇంటి స్థలం మంజూరు

భూమి పూజ చేసిన జిల్లా కలెక్టర్



యాదాద్రి భువనగిరి అక్షరకలం

అధికారం అంటే కేవలం ఆదేశాలు ఇవ్వడమే కాదు, ఆపదలో ఉన్న వారికి అండగా నిలబడటం అని నిరూపించారు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్. సంస్థాన్నారాయణపురం మండలం కంకణాల గూడెం గ్రామానికి చెందిన భరత్ చంద్రాచారి అనే విద్యార్థిని దత్తత తీసుకున్న కలెక్టర్, తాజాగా ఆ కుటుంబానికి సొంత ఇంటి కలను నిజం చేస్తూ మరో గొప్ప ముందడుగు వేశారు. భరత్ చంద్ర చదువుకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో కలెక్టర్ గత కొంతకాలంగా ప్రతి నెలా 5,000 రూపాయల ఆర్థిక సాయంతో పాటు, ఆ కుటుంబానికి అవసరమైన నిత్యావసర సరుకులను స్వయంగా అందిస్తున్నారు. అయితే, ఆ కుటుంబానికి నివసించడానికి సరైన ఇల్లు లేక ఇబ్బంది పడుతున్న విషయం కలెక్టర్ దృష్టికి రావడంతో వెంటనే స్పందించారు.ప్రభుత్వం తరపున 225 గజాల ఇంటి స్థలాన్ని మంజూరు చేయించడమే కాకుండా, గురువారం నాడు స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..నాకు బదిలీ అయినా సరే, భరత్ చంద్రకు ఏ అవసరం వచ్చినా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను. చదువులో వెనకడుగు వేయొద్దు" అని ఆ బాలుడికి ధైర్యం చెప్పారు. ఇంటి నిర్మాణ పనుల్లో ఎక్కడా రాజీ పడకుండా, అత్యంత నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.కాగా కలెక్టర్ తీసుకున్న ఈ నిర్ణయంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్ రెడ్డి, తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీఓ, సబ్ ఇన్స్పెక్టర్, ఎంపీవో, పంచాయతీ సెక్రటరీ, మాజీ సర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# రాబోయే తరాలను తీర్చిదిద్దే బాధ్యత “గురువులదే”

**కేంద్ర జాయింట్ సెక్రటరీ కమలేష్ కుమార్ మిశ్రా పిలుపు**

**21వ శతాబ్దపు సవాళ్లకు విద్యార్థులను సిద్ధం చేయాలని సూచన**

**98 పనుల్లో 20 పూర్తి చేసినట్లు వెల్లడించిన కలెక్టర్ చంద్రశేఖర్**

ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం






సమాజానికి రాబోయే తరాలను తయారు చేసే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని కేంద్ర సాంస్కృతిక శాఖ, పిఎం.శ్రీ పాఠశాలల జాయింట్ సెక్రెటరీ, నోడల్ అధికారి కమలేష్ కుమార్ మిశ్రా అన్నారు. జిల్లాలో పీఎం శ్రీ పాఠశాలల అధ్యయనం నిమిత్తం రెండు రోజుల నల్గొండ జిల్లా పర్యటన నిమిత్తం జిల్లాకు వచ్చిన జాయింట్ సెక్రటరీ కమలేష్ కుమార్ మిశ్రాకు గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పి ఎం శ్రీ పాఠశాలల ప్రిన్సిపల్స్ తో నిర్వహించిన సమీక్ష సందర్భంగా కమలేష్ కుమార్ మిశ్రా మాట్లాడుతూ సమాజంలో గురువులకు ఉన్నంత గౌరవ, మర్యాదలు మరెవరికి లేవని, అయితే అదే సమయంలో భవిష్యత్తు తరాలను తీర్చిదిద్దే బాధ్యత గురువులపై ఉందని అన్నారు. అందువల్ల టీచర్లందరూ రాబోయే తరాలను తీర్చిదిద్దడం పైనే ఆలోచన చేయాలని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న సమయంలో పిఎం శ్రీ పాఠశాలల ద్వారా సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా అభ్యసనను సరైన పద్ధతిలో విద్యార్థులకు చేరవేయడం, ఎల్లప్పుడు విద్యార్థులు అప్ డేట్ గా ఉండేలా చూడడం, అవకాశాలను అందిపుచ్చుకుని 21వ శతాబ్దానికి తగ్గట్టుగా వారిని తీర్చిదిద్దడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇందుకు ప్రభుత్వం తరపున అవసరమైన మౌలిక సదుపాయాలు, నిధులు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. పి ఎం శ్రీ పాఠశాలలకు ఇస్తున్న కంప్యూటర్లు,టింకరింగ్ ల్యాబ్స్ వంటి అన్ని సదుపాయాలను విద్యార్థులు ప్రత్యక్షంగా వినియోగించుకునేలా చూడాలని, ముందుగా పీఎం శ్రీ పాఠశాలల్లో పనిచేసే ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు అందరూ కంప్యూటర్ పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ,కంప్యూటర్లో కనీస సామర్థ్యాలు తెలిసి ఉండాలి అన్నారు. యోగ హ్యాండీక్రాఫ్ట్స్ తదితర వాటిపై దృష్టి సారించాలని, ప్రముఖ వ్యక్తుల చరిత్రలను విద్యార్థులకు తెలియజేయడం ద్వారా వారిలో చైతన్యం నింపాలని, విద్యార్థులను అన్ని రకాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ పిఎం శ్రీ పాఠశాలల కింద మంజూరైన నిధులతో అదనపు తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబులు, వాననీటి నిలువ కట్టడాలు, సైన్స్ ల్యాబులు,టాయిలెట్ బ్లాక్ ల వంటివి చేపడుతున్నామని,జిల్లాకు మొత్తం 98 పనులు మంజూరు కాగా, ఇప్పటివరకు 20 పూర్తి చేయడం జరిగిందని, తక్కినవి కూడా త్వరలోనే పూర్తి చేస్తామని,పి ఎం శ్రీ పాఠశాలల ప్రిన్సిపాల్స్, టీచర్లు విద్యార్థులకు మెరుగైన గుణాత్మక విద్యను అందించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. అంతకుముందు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో ఉన్న 43 పిఎం శ్రీ పాఠశాలల్లో చేపట్టిన కార్యక్రమాలు, ఫలితాలు, తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా యంత్రాంగం జాయింట్ సెక్రెటరీ కి తెలియజేసింది. రాష్ట్ర విద్యాశాఖ ప్రతినిధి ఉషారాణి, డీఈఓ బిక్షపతి, జెడ్పిసిఈఓ శ్రీనివాసరావు, పిఎం శ్రీ పాఠశాలల ప్రిన్సిపల్స్ ఈ సమావేశానికి హాజరయ్యారు.

## భువనగిరి మున్సిపాలిటీని సమిష్టిగా అభివృద్ధిలో అగ్రగామిగా నిలబెడదాం

**భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి**

**భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

యాదాద్రి భువనగిరి అక్షర కలం

యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించిన భువనగిరి ప్రజలకు భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. గురువారం భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగెళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు మరియు నూతన కౌన్సిలర్లు పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఎంపీ సమావేశానికి హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలనలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని ఆయన అన్నారు. సమిష్టి గా భువనగిరి ఖిలా పై కాంగ్రెస్ జెండా ఎగురవేశామని ఆయన గుర్తు చేశారు. భువనగిరి నియోజకవర్గంలో మూసీ ప్రక్షాళన, ఎం ఎం టి ఎస్, ట్రిబుల్ ఆర్, యూ సి ఎఫ్ (అర్బన్ డెవలప్మెంట్ ఫండ్) ద్వారా భువనగిరి ని అభివృద్ధి చేసుకుందామని ఆయన అన్నారు. భువనగిరి శాసన సభ్యులు కుంబం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గత 40 ఏళ్ళ నుండి ఇంత మెజారిటీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు రాలేదని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అధిక మెజారిటీ తో గెలిపించి నందుకు భువనగిరి మున్సిపాలిటి ప్రజలకు కాంగ్రెస్ పార్టీ రుణపడి ఉంటుందని ఆయన అన్నారు. భువనగిరి, బీబీనగర్ మండలాల నుంచి కార్యకర్తలు వచ్చి కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేసారని ఆయన తెలిపారు. భువనగిరి మున్సిపాలిటీ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మంచి అభిప్రాయం ఉందని, భువనగిరి మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో అభిమానం మరింత పెరిగిందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రామలింగం, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




## దేవరకొండ ఖిల్లాకు పూర్వవైభవం - ఎమ్మెల్యే బాలు నాయక్ కృషి, వినోద్ నాయక్ పోరాటాల ఫలితం

అక్షరకలం దేవరకొండ

చారిత్రక వారసత్వ సంపద అయిన దేవరకొండ ఖిల్లాను పర్యాటక కేంద్రంగా మార్చాలని, దానికి పూర్వవైభవం తీసుకురావాలని గత ఎన్నో ఏళ్లుగా వినోద్ నాయక్ (రాఖ) గారు చేపట్టిన అలుపెరగని పోరాటం నేడు సఫలమైంది. దశాబ్ద కాలంగా ఆయన ఎన్నో పేపర్ ప్రకటనల ద్వారా, ఉద్యమాల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చారు.



**కృతజ్ఞతలు మరియు అభినందనలు:**

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దేవరకొండ కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నాము. ముఖ్యంగా దేవరకొండ నియోజకవర్గంలోని పర్యాటక, ఆధ్యాత్మిక, చారిత్రక ప్రాంతాలను గుర్తించి నిధులు కేటాయించేందుకు చొరవ చూపడం అభినంద నీయం.

**మా ప్రధాన డిమాండ్లు:**

100 కోట్ల నిధులు: శిథిలావస్థకు చేరుతున్న ఖిల్లాను సంరక్షించడానికి మరియు అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కనీసం 100 కోట్ల ప్రత్యేక నిధులను కేటాయించాలి. స్థానిక నిరుద్యోగులకు ఉపాధి: ఈ ప్రాంతం పర్యాటక హబ్‌గా మారడం ద్వారా వచ్చే ఆదాయంలో మరియు ఇక్కడ కల్పించే సేవలలో స్థానిక నిరుద్యోగ యువతకే ప్రథమ ప్రాధాన్యత (ఉపాధి అవకాశాలు) కల్పించాలి. సమగ్ర అభివృద్ధి: ఖిల్లాతో పాటు దేవరచర్ల శివాలయం, డిండి, వైజాగ్ కాలనీ వంటి ప్రాంతాలను కూడా పర్యాటక పటంలో చేర్చి అభివృద్ధి చేయాలి. వినోద్ నాయక్ గారు గతంలో చేసిన పోరాటాల ఫలితంగానే నేడు పాలకుల్లో ఈ కదలిక వచ్చిందని ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నాము. మన పూర్వీకుల సంపదను కాపాడుకుంటూ, దేవరకొండను పర్యాటక కేంద్రంగా మార్చే ప్రక్రియలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేయాలని కోరుతున్నాము.

## దేవరకొండలో ఘనంగా జిల్లా స్థాయి క్రీడల పోటీలు

అక్షరకలం దేవరకొండ

దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ మరియు మేరా భారత్ నల్గొండ ఆధ్వర్యంలో గురువారం జిల్లా స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. స్థానిక స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో నిర్వహించిన కబడ్డీ, షటిల్ బాడ్మింటన్, టగ్ ఆఫ్ వార్, రన్నింగ్ పోటీలను ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడాకారుల సౌకర్యార్థం నియోజకవర్గంలో త్వరలోనే స్టేడియాల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం బహుమతి ప్రధానోత్సవంలో పాల్గొన్న డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసానికి, ఏకాగ్రతకు తోడ్పడతాయని, క్రీడాకారులు స్నేహభావంతో మెలిగి నైపుణ్యాన్ని చాటాలని పిలుపునిచ్చారు. దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ సేవలను వారు అభినందించారు.



## అర్హులైన ప్రతి ఒక్కరికి లోన్లు అందే విధంగా చూడాలి......మెప్మా పి.డి. శ్రీనివాస్...



అక్షర కలం నాగార్జునసాగర్/ నందికొండ :--

నందికొండ పురపాలక సంఘం కార్యాలయంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో (టౌన్ లెవెల్ ఫెడరేషన్) మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో నందికొండ పట్టణంలో ఉన్నటువంటి స్వయం సహాయక సంఘాల ద్వారా స్ట్రీట్ వెండర్ లోన్స్ మరియు కింద అర్హులైన ప్రతి ఒక్కరికి లోన్స్ అందేలా టార్గెట్ ను పూర్తి చేయాలని ఆదేశించడం జరిగింది. అదేవిధంగా మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ లోన్స్ తీసుకున్నవారు తొందరగా క్లియర్ చేసి మళ్ళీ ఎక్కువ లోన్ తీసుకొనుటకు అవకాశం ఉంటుందని తెలియజేశారు. మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి మాట్లాడుతూ నందికొండ పట్టణంలో వివిధ సంఘాలలో ఉన్నటువంటి నిరుద్యోగ యువతీ యువకుల సభ్యులను గుర్తించి వారికి వివిధ రంగాలలో ఉపాధి చూపేలా ట్రైనింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి ఎం సి శివాజీ , టిఎంసి బక్కయ్య , రిసోర్స్ పర్సన్స్, మరియు మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాలో జరిగిన ఉపాధి హామీ పనుల మీద కేంద్ర బృందంనకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

అక్షర కలం సూర్యాపేట

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పేరును కేంద్ర ప్రభుత్వం గా మారుస్తున్న తరుణంలో మీా=ణ (కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ) కేంద్ర బృందం సభ్యులు సంజయ్ కుమార్ నేతృత్వంలో తేది.26-02-2026 నుండి 28-02-2026 వరకు సూర్యాపేట జిల్లాలో పర్యటన సందర్భంగా గురువారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో సమావేశమయ్యారుఇట్టి సమావేశంలో సూర్యాపేట జిల్లాలో జరిగిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనుల పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బృంద సభ్యులకు వివరించారు. అనంతరం ఈజీఎస్ పథకాల పనులపై జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ప్రదర్శనను కేంద్ర బృందం, కలెక్టర్ తిలకించారు. ఈ



కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, డిప్యూటీ సీఈవో శిరీష, కేంద్ర బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## రోడ్డు నిబంధనలు పాటిస్తూ.. సురక్షితమైన ప్రయాణం సాగించాలి: “కారేపల్లి ఎస్సై”

అక్షర కలం/ కారేపల్లి:



రోడ్డు నిబంధనలు పాటిస్తూ సురక్షితమైన ప్రయాణం సాగించాలని కారేపల్లి ఎస్సై గోపి అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలో భాగంగా పోలీస్ శాఖ నిర్వహిస్తున్న రెండోవ విడత అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి పర్యవేక్షణలో కారేపల్లిలో ఆటో డ్రైవర్లకు,వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్బంగా ఎస్సై మాట్లాడుతూ.. అతివేగం.. మద్యం మత్తు.. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, దీంతో రహదారులు నెత్తురోడుతుండగా విలువైన ప్రాణాలు కోల్పోయి, బాధిత కుటుంబాల్లో విషాదం అలుముకుంటోందని అన్నారు. రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణపై పోలీస్ శాఖ జిల్లాలో దృష్టి సారించిందని పేర్కొన్నారు. రోడ్డు భద్రత అనేది పోలీసుల ఒక్కరి బాధ్యత కాదని, సమాజం మొత్తంగా ముందుకు వస్తేనే ప్రమాదాలను తగ్గించగలమని అన్నారు. ‘అరైవ్ అలైవ్’ ఒక ఉద్యమంగా మారాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని కేవలం ఒక అవగాహన కార్యక్రమంగా కాకుండా, ప్రజా ఉద్యమంగా మార్చాలన్నదే పోలీస్ శాఖ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి వ్యక్తి ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, ఇతరులను కూడా ప్రోత్సహిస్తేనే నిజమైన మార్పు సాధ్యమవుతుందని అన్నారు.

## ఇల్లందు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులుగా గడ్డం వెంకటేశ్వర్లు, బండి రామారావులు ఏకగ్రీవ ఎన్నిక.

అక్షర కలం / ఇల్లందు.




ఇల్లందు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని గురువారం జెకె కాలనీలో గల ప్రెస్ క్లబ్ కార్యాలయంలోజరిగిన సర్వసభ్య సమావేశంలో ప్రింట్ మీడియా నుండి గడ్డం వెంకటేశ్వర్లు, ఎలక్ట్రానిక్ మీడియా నుండి బండి రామారావు లను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు గడ్డం వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి బండి రామారావులు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి పరమైన సమస్యల పరిష్కారానికి సమస్యగా అందరిని కలుపుకొని కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ జర్నలిస్టులు సంగెమ్ వేణుగోపాల్, గుడివాడ శ్రీనివాస్, దుద్దికూరి సుమంత్, మాదాసు నర్సి, కసోజుల రాజు, ఎల్. శ్రీనివాస్,దేవి రెడ్డి,సువర్ణపాక శోభన్ బాబు, తంగళ్ళపల్లి శ్రీనివాసచారి, మహేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టపగలే భారీ చోరీ

**--ఆటో డ్రైవర్ ఇంట్లో ఆరు తులాల బంగారం, నగదు అపహరణ**

అక్షరకలం, చండూరు



నల్గొండ జిల్లా చండూరు మున్సిపల్ కేంద్రంలో పట్టపగలే భారీ దొంగతనం జరగడం స్థానికంగా కలకలం రేపింది. స్థానిక ఆటో డ్రైవర్ దేప వెంకట్ రెడ్డి (45) గురువారం మధ్యాహ్నం తన భార్యతో కలిసి కస్తాల గ్రామంలో బంధువుల వివాహానికి వెళ్లగా, ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడ్డారు. వేడుక ముగించుకుని తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు విరిగి ఉండటం, బీరువాలోని బట్టలు చిందరవందరగా పడి ఉండటం చూసి బాధితులు దిగ్భ్రాంతికి గురయ్యారు. బీరువాలో దాచుకున్న సుమారు 6 తులాల బంగారు ఆభరణాలు మరియు రూ. 80,000 నగదు అపహరణకు గురైనట్లు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న చండూరు ఎస్.ఐ శివకుమార్ క్షుణ్ణంగా పరిశీలించి, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జనసంచారం ఉండే సమయంలోనే ఈ చోరీ జరగడంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

# మేడ్చల్ బస్సు డిపోలో అధ్వాన పరిస్థితి!







## దుర్గంధంతో ప్రయాణికుల ఉక్కిరిబిక్కిరి

### ఎక్కడపడితే అక్కడ డ్రైనేజీ నీళ్లు, చెత్తాచెదారం

### అధికారులు చొరవ తీసుకొని సమస్య పరిష్కరించాలి

**మేడ్చల్, ఫిబ్రవరి 26(అక్షరకలం)**

ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బస్సు డిపో ప్రస్తుతం అపరిశుభ్రతకు నిలయంగా మారింది. మేడ్చల్ డిపో ఆవరణలో ఎటు చూసినా పేరుకుపోయిన చెత్త, నిలిచిపోయిన మురుగు నీరు వెదజల్లుతున్న దుర్గంధంతో ప్రయాణికులు ముక్కులు మూసుకొని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మున్సిపాలిటీ నుండి జిహెచ్ఎంసి లో విలీనమైన మేడ్చల్ డిప్పో లో డ్రైనేజీ సమస్య మాత్రం తీరడం లేదని ప్రయాణికులు మండిపడుతున్నారు. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న మ్యాన్ హోల్స్ నుండి డిపోలోకి డ్రైనేజీ నీళ్లు పొంగిపొర్లుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షపు నీరు, మురుగు నీరు కలిసి బయటకు వెళ్లే దారి లేక డిపోలోకి పరుగులు తీస్తున్నాయి. దీంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిపోలో డ్రైనేజీ నీళ్లతో పాటు, చెత్తాచెదారం పేరుకుపోవడంతో దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



### దుర్వాసన వెదజల్లుతుంది

ప్లాట్‌ఫారమ్‌ల సమీపంలోనే చెత్త కుప్పలు పేరుకుపోవడంతో తీవ్రమైన దుర్వాసన వస్తోందని గంటల తరబడి బస్సుల కోసం వేచి ఉండే వృద్ధులు, చిన్న పిల్లలు, విద్యార్థులు ఈ దుర్వాసన భరించలేక అనారోగ్యం పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నిర్వహణ లోపం

'రోజూ వేల సంఖ్యలో ప్రయాణికులు వచ్చే ఈ డిపోలో కనీస పారిశుధ్యం లేకపోవడం దారుణం. బస్సు కోసం ఐదు నిమిషాలు కూడా ఇక్కడ నిలబడలేకపోతున్నామని, అధికారులు ఇప్పటికైనా స్పందించి శుభ్రతపై దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

### అధికారులు స్పందించాలి

ప్రభుత్వం 'స్వచ్ఛ భారత్' అంటూ నినాదాలు చేస్తున్నా, క్షేత్రస్థాయిలో బస్సు డిపోల పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత ఆర్టీసీ అధికారులు జిహెచ్ఎంసి సిబ్బంది సమన్వయంతో పనిచేసి, డిపోలో పేరుకుపోయిన చెత్తను తొలగించి, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# చైర్పర్సన్ కు కాంగ్రెస్ కౌన్సిలర్ల సత్కారం



**మేడ్చల్, ఫిబ్రవరి 26 (అక్షరకలం):**

ఎల్లంపేట మున్సిపాలిటీకి నూతనంగా ఎన్నికైన చైర్ పర్సన్ లావుడియా శ్రీదేవిని మున్సిపల్ ఆఫీసు నందు ఎల్లంపేట కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు ఎల్లంపేట మున్సిపల్ అధ్యక్షులు కౌన్సిలర్ ఎర్రవల్లి విఘ్నేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎల్లంపేట మున్సిపల్ ఆఫీసులో శాలువాతో సత్కరించడం జరిగింది. మొదటగా ఎల్లంపేట మున్సిపల్ ఆఫీసులోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా మున్సిపల్ కమిషనర్ స్వామి నాయక్ ను శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఎల్లంపేట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎర్రవల్లి విఘ్నేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు మాపై నమ్మకంతో కౌన్సిలర్లుగా గెలిపించడం జరిగిందని ఎల్లంపేట మున్సిపాలిటీ అభివృద్ధికి పార్టీలకతీతంగా తమ వంతు కృషి చేస్తామని ఎల్లంపేట మున్సిపాలిటీ అభివృద్ధి దిశగా ముందుకు వెళ్లడానికి తమ వంతు సహకారాన్ని అందిస్తామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎర్రవల్లి విఘ్నేశ్వర్ రెడ్డి, ముత్యాల్ గౌడ్, ఆరిఫ్, నాతి వేణుగోపాల్ గౌడ్, గూడూరువిజయలక్ష్మి, నునావత్ పార్వతి, మామిళ్ళ బాలమని, శాంతి రాజు నాయక్, కాంగ్రెస్ నాయకులు, అంకుల అశోక్ గౌడ్, షాహిన్ పాషా, మామిళ్ళ బాలేష్, సల్లా వెంకటేష్, పాల్గొన్నారు.

# జిల్లా అదనపు కలెక్టర్ గా ఫైజాన్ అహ్మద్

### మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ ను కలిసిన అదనపు కలెక్టర్



**మేడ్చల్, ఫిబ్రవరి 26 (అక్షరకలం):**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా ఫైజాన్ అహ్మద్ ఐఏఎస్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం అదనపు కలెక్టర్ ఛాంబర్లో బాధ్యతలు స్వీకరించారు. ముందుగా మర్యాద పూర్వకంగా జిల్లా కలెక్టర్ ను కలిసి పూల మొక్క అందించారు. నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ గా విధులు నిర్వహిస్తూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు బదిలీపై నియమితులయ్యారు.

# అనుమానాస్పదంగా నిర్వహిస్తున్న పారామెడికల్, నర్సింగ్ విద్యాసంస్థలు

### సమగ్ర తనిఖీలు నిర్వహించి చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలి

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26:**

జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలో బైపాస్ రోడ్ తెలంగాణ తల్లి విగ్రహ సమీపంలో ఒకే భవనంలో సూర్య తేజ పారామెడికల్ ఇన్స్టిట్యూట్ అదే విధంగా లక్ష్మీ నర్సింగ్ స్కూల్ (జిఎన్ఎమ్ స్టాఫ్ నర్స్) అనే పేర్లతో రెండు వేరువేరు పారామెడికల్, నర్సింగ్ విద్యాసంస్థలు నిబంధనలకు విరుద్ధంగా, అనుమానాస్పదంగా నిర్వహిస్తున్నారని, తక్షణమే వాటిపై సమగ్ర తనిఖీలు నిర్వహించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి సేన జన సమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డిఎంహెచ్ఓ) కి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఒకే భవనంలో రెండు వేరువేరు విద్యాసంస్థలు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇది ప్రభుత్వ నిబంధనలకు విద్య నియంత్రణ మార్గదర్శకాలకు పూర్తిగా విరుద్ధమైన చర్య అని తెలిపారు. పారామెడికల్, నర్సింగ్ విద్యాసంస్థలు నిర్వహించడానికి సంబంధిత ప్రభుత్వ శాఖల నుండి ప్రత్యేక గుర్తింపు, అనుమతులు, వేరువేరు భవనాలు, కోర్సులకు తగిన మౌలిక సదుపాయాలు, అనుభవం, అర్హత కలిగిన బోధన సిబ్బంది, ప్రయోగశాలలు, క్లినికల్ అనుబంధాలు, అగ్నిమాపక భద్రత ప్రమాణాలు, విద్యార్థుల భద్రతకు సంబంధించి అన్ని ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. రెండు విద్యాసంస్థలు ఒకే భవనంలో, ఒకే ప్రాంగణంలో కార్యాకలాపాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో వీటికి నిజంగా చట్టబద్ధత అనుమతులు ఉన్నాయా, నిబంధనల ప్రకారం మౌలిక వసతులు, బోధన సదుపాయాలు కల్పిస్తున్నారా, క్లినికల్ శిక్షణా నిజంగా అందిస్తున్నారా అని అనుమానాలు వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా, అనుమానాస్పద పరిస్థితిలో విద్య సంస్థలు నిర్వహించడం వలన నిరుపేద, అవగాహన లేని విద్యార్థులు మోసపోయే ప్రమాదం అత్యంత ఎక్కువగా ఉందని తెలిపారు. సరైన శిక్షణ లేకుండా వైద్య, నర్సింగ్ రంగాలలో పని చేసే వ్యక్తులు, భవిష్యత్తులో ప్రజా ఆరోగ్యానికి, రోగుల భద్రతకు, సమాజానికి ప్రమాదంగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఆయా విద్య సంస్థలపై సమగ్ర తనిఖీలు నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లయితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకొని, విద్యాసంస్థలను సీజ్ చేయడంతో పాటు గుర్తింపు రద్దు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.




# 2047 నాటికి ఈ రంగంలో తిరుగులేని శక్తిగా తెలంగాణ రాష్ట్రం

### 'ఫ్యూచర్ రెడీ ఎకో సిస్టం' అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు

### 'ట్రాన్స్ పోర్ట్ లాజిస్టిక్ ఇండియా 2026' సదస్సులో

### మంత్రి శ్రీధర్ బాబు:

**హైదరాబాద్ : ఫిబ్రవరి 26, ( అక్షర కలం న్యూస్ )**

: తెలంగాణను దేశంలోని అగ్రశ్రేణి లాజిస్టిక్ హబ్ లల్లో ఒకటిగా తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఆ దిశగా మౌలిక సదుపాయాల అభివృద్ధి, డిజిటల్ ఇంటిగ్రేషన్, పాలసీ అండ్ రెగ్యులేటరీ ఫెసిలిటేషన్, సస్టైనబిలిటీ అండ్ గ్రీన్ లాజిస్టిక్స్, స్కిల్ డెవలెప్ మెంట్ అండ్ ఇన్నోవేషన్ తో కూడిన 'ఫ్యూచర్ రెడీ ఎకో సిస్టం' అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. ముంబై లోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్ లో 'మెస్సే ముంచెన్ ఇండియా(మెస్సే ముంచెన్ జర్మనీ అనుబంధ సంస్థ)' నిర్వహిస్తోన్న 'ట్రాన్స్ పోర్ట్



లాజిస్టిక్ ఇండియా 2026' సదస్సులో గురువారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... దేశ ఆర్థిక గమనాన్ని నిర్దేశించే కీలక రంగాల్లో ప్రధానమైన 'లాజిస్టిక్ రంగం'లో 2047 నాటికి తెలంగాణను తిరుగులేని శక్తిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు. భౌగోళిక విస్తీర్ణంలో పదకొండు, జనాభాలో పన్నెండో స్థానంలో ఉన్న తెలంగాణ వాటా దేశ జీడీపీలో ప్రస్తుతం 5 శాతంగా ఉందన్నారు. దీనిని 2047 నాటికి 10 శాతానికి పెంచాలనే సంకల్పంతోనే 'తెలంగాణ రైజింగ్ 2047' డాక్యుమెంట్ కు శ్రీకారం చుట్టామన్నారు. 3 ట్రిలియన్ డాలర్లకు తెలంగాణ ఆర్థిక వ్యవస్థను చేర్చాలనే లక్ష్య సాధనలో లాజిస్టిక్ రంగానిదే కీలక పాత్ర అని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా సరఫరా గొలుసుల పునర్నిర్మాణం, ఏఐ ఆధారిత ఇంటెలిజెంట్ లాజిస్టిక్స్, సస్టైనబిలిటీ అనే మూడు ప్రధాన మార్పులు లాజిస్టిక్స్ రంగాన్ని సమూలంగా మార్చేస్తున్నాయన్నారు. ఇలాంటి తరుణంలో భౌగోళికంగా మనకున్న అనుకూలతలను 'డిజైన్ అడ్వాంటేజ్'గా మార్చుకుని సత్తా చాటేలా ముందుకెళు తున్నామన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో ఫేజ్ -- 2, కొత్త ఎయిర్ పోర్టులు, డ్రై పోర్టు, తెలంగాణ లాజిస్టిక్స్ పాలసీ 2.0, లాజిస్టిక్ హబ్స్ తదితర ప్రాజెక్టులు ఈ రంగంలో రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా మార్చుతాయనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ, ఇతర భాగస్వామ్య పక్షాల సహకారంతో లాజిస్టిక్స్ రంగానికి అవసరమైన రెడీ టూ వర్క్ ఫోర్స్ ను తయారు చేస్తున్నామని పునరుద్ఘాటించారు. కేవలం వస్తువులను ఉత్పత్తి చేయడమే కాకుండా, వాటిని ప్రపంచం ఊహించని వేగంతో డెలివరీ చేసి 'లాజిస్టిక్ పవర్ హౌస్'గా ఎదిగే సత్తా తెలంగాణకు ఉందని స్పష్టం చేశారు. మల్టీ మోడల్, రైల్ లింక్డ్ అసెట్స్, ఎయిర్ కార్గో, కోల్డ్ చైన్, గ్రేడ్ -- ఏ వేర్ హౌజింగ్, ఆటోమేషన్, డిజిటల్ ప్లాట్ ఫామ్స్, గ్రీన్ మొబిలిటీ తదితర కేటగిరీల్లో పెట్టుబడులు పెట్టి 'తెలంగాణ రైజింగ్'లో భాగస్వామ్యం కావాలని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. వేగవంతమైన అనుమతులు, పారదర్శకమైన పాలసీలు, ప్రోత్సాహకర విధానాలతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

### రామగుండం పోలీస్

### కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

### అరైవ్ – అలైవ్ రెండో విడతలో భాగంగా ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26:**

రోడ్డు ప్రమాదాలు నివారించడం, ప్రతి వాహనదారులు సురక్షితంగా తమ గమ్యస్థానానికి చేరుకోవడమే ప్రధాన లక్ష్యంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. అరైవ్ – అలైవ్ రెండో విడత కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని ఐబి చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై, డంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపి అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ, మద్యం సేవించి వాహన నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రాణం కన్నా విలువైనది ఏదీ లేదని, ప్రతి ఒక్కరు ఖచ్చితంగా ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ, బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని సూచించారు. సురక్షిత ప్రయాణంతో గమ్యస్థానం చేరుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్, మంచిర్యాల ఏసిపి ఆర్ ప్రకాష్, ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్, మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్ రావు, ట్రాఫిక్ సిఐ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# పట్టణంలోని ఒకటో వార్డులో విస్తృతంగా పర్యటించిన మునిసిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్మిత్ర డానియల్.



అక్షర కలం / ఇల్లందు

ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ పట్టణంలోని 1వ వార్డు సత్యనారాయణపురంలో అవార్డు కౌన్సిలర్ షేక్ సైదు మియా ఆధ్వర్యంలో గురువారం విస్తృతంగా పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలు తమ వార్డులను సమస్యలను చైర్పర్సన్ కు తెలియజేయడంతో స్పందించిన చైర్ పర్సన్ దొడ్డ కిరణమిత్ర డానియల్ డ్రైనేజీ వ్యవస్థ రోడ్ల పరిస్థితి తగులు వస్తువులపై తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన ఫోన్లో ఆదేశించారు. ఈ సందర్భంగా దొడ్డ కిరణమిత్ర డానియల్ మాట్లాడుతూ నూతనంగా మున్సిపల్ చైర్ పర్సన్ గా ఎన్నికైన తను పట్టణంలోని ఉన్న 24 వార్డులలో పర్యటించి సమస్యలను ఆకలింపు చేసుకొని ముందుగా తాగునీటి వసుతులపై,వీధిలైట్ల సమస్యను, కాలువలలో పేరుకుపోయిన దుర్గంధాన్ని తొలగించడం, రోడ్డుకి ఇరువైపులా ఉన్న పిచ్చి చెట్లను తొలగించి పరిశుభ్రంగా ఉంచడం తదనంతరం నూతన రహదారులను ఏర్పరిచేందుకు ప్రణాళికలు తయారు చేయడం జరుగుతుందని వారు ప్రజలకు తెలిపారు. ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య సహకారంతో మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆశీస్సులతో ప్రతి వార్డును సుందరవనంగా అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తామని వారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్కే మున్న,ఏ.మురళి, ఎస్కే యాకూబ్ పాషా, ప్రవీణ్, మహేందర్ రెడ్డి, ఉపేందర్, కొండపల్లి సంపత్ ,దళితరత్న మేకలశ్యామ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పంపిణీ...

**– యువ సంకల్పం ఫౌండేషన్ అధ్యక్షులు తుమ్మ రాజ్ కుమార్.**




పెద్దపల్లి జిల్లా ప్రతినిధి,ఫిబ్రవరి 26 (అక్షర కలం)

మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు యువ సంకల్పం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత పరీక్ష ప్యాడ్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఈ ఏడాది ఘనంగా చేపట్టారు.సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శాస్త్రి నగర్లో గల సోషల్ వెల్ఫేర్ హాస్టల్తో పాటు పూసాల గ్రామ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ అందజేశారు.ఈ సందర్భంగా తుమ్మ రాజ్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అన్ని విధాలుగా అండదండగా నిలవడం తమ ఫౌండేషన్ లక్ష్యమని,ప్రతి సంవత్సరం సుల్తానాబాద్ మండలంలోని పదో తరగతి విద్యార్థులందరికీ ఉచితంగా పరీక్ష ప్యాడ్స్ అందిస్తున్నామని, అందులో భాగంగానే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు.విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని, పోటీ ప్రపంచంలో ఎక్కువగా చదివి మంచి స్థాయికి చేరుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, గురువులకు గౌరవం తీసుకురావాలంటే విద్యార్థులు చదువు లో ఉన్నంతంగా ఎదుగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణమాచార్యులు, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి తుమ్మ నిశాంత్, సభ్యులు గంగిశెట్టి ఆంజనేయులు,దేవసాని సన్నీ, నరేష్ లతో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# పేదింటి ఆడబిడ్డలకు 'కళ్యాణ' కానుక

**– యామిని కుటుంబానికి లబ్ధి**

**– చెక్కు పంపిణీ చేసిన తహసీల్దార్, సర్పంచ్**

అక్షర కలం/ నేలకొండపల్లి:

నేలకొండపల్లి : ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రభుత్వం అందిస్తున్న 'కళ్యాణ లక్ష్మి' పథకం కొండంత అండగా నిలుస్తోందని నేలకొండపల్లి తహసీల్దార్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రాజారాంపేట గ్రామానికి చెందిన బండ్ల యామినికి మంజూరైన కళ్యాణ లక్ష్మి చెక్కును ఆమె తల్లి బండ్ల తిరుపతమ్మకు అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి అందజేశారు.

**భరోసా కల్పిస్తున్నాం**

ఈ సందర్భంగా రాజారాంపేట సర్పంచ్ రాయపూడి రామారావు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తున్నామన్నారు. ఆడబిడ్డల పెళ్లిళ్లు భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ఆర్థిక సాయాన్ని అందిస్తోందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సకాలంలో చెక్కు మంజూరు కావడం పట్ల లబ్ధిదారుల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు మధుసూదన్, రమాదేవి, కాంగ్రెస్ నాయకులు చిట్టూరి అచ్చయ్య, బండ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంది...

**నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణం కోసం శంకుస్థాపన...**

**గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి.**

**పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు**

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26 (అక్షర కలం)



ఎలిగేడు మండలం ర్యాకల్ దేవ్ పల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణం కోసం ?20 లక్షల రూపాయల నిధులతో శంకుస్థాపన చేసి భూమి పూజ చేసి పనులు ప్రారంభించిన అనంతరం ? 5 లక్షల రూపాయల నిధులతో అంగన్వాడీ భవనం రినివేషన్ చేసి ప్రారంభించిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ..దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా అనేక సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో చేపడుతున్నామని అన్నారు.. గ్రామంలో జరిగే ప్రతి అభివృద్ధి పనులు గ్రామస్తులు భాగస్వాములై నాణ్యత ప్రమాణాలు పాటించేలా అధికారులను నిలదీయాలని అన్నారు. గ్రామంలో అనేక అభివృద్ధి పనులతో పాటు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని అన్నారు.... ఈ కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచ్ లు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు.. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26:



జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డిసిపి ఎ భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి పోలీస్, రవాణా, జాతీయ రహదారులు, రోడ్లు భవనాలు, ఆర్టిసి, విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణపై రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని రోడ్లపై చెత్త, ఆటంకాలను వెంటనే తొలగించాలని, ట్రాఫిక్ పోలీసు విభాగం రోడ్లపై అనధికార వాహన నిలుపుదల, నిబంధనల ఉల్లంఘన పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై తక్కువ ఎత్తు గల బీమ్లు, తక్కువ విజిబిలిటీ ఉన్న చోట్ల లైటింగ్ ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారులపై రంబుల్ స్ట్రిప్స్, లైటింగ్, జాగ్రత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రోడ్లపై అదుపు తప్పిన, ఓవర్ లోడెడ్ వాహనాలు, పరిమితికి మించి వేగంగా వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ పోలీసు అధికారులు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి చేయడంలో కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో రోడ్డు భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని, గోదావరి పుష్కరాల నేపథ్యంలో ప్రమాదాల నివారణలో భాగంగా లైటింగ్ ఏర్పాట్లు చేయాలని, గ్రామీణ ప్రాంతాలలో అంతర్గత రహదారులలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని, రహదారులపై కేజ్ వీల్స్, ట్రాక్టర్ కేజ్ వీల్స్ వినియోగాన్ని నిలిపివేసేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, జిల్లా వ్యాప్తంగా వేగ పరిమితి బోర్డులు, హెచ్చరిక బోర్డులు, జాగ్రత్త సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. కూరగాయల వ్యాపారులు రహదారులపై విక్రయాలు చేయకుండా ప్రత్యేక మార్కెట్ స్థలాన్ని గుర్తించి తగు ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. రహదారులపై వాహనాల వేగాని నియంత్రించేందుకు ఏర్పాట్లు చేయాలని, ప్రతి మండల, గ్రామాల పరిధిలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో పట్టుబడిన వారి లైసెన్సులు రద్దు చేయాలని, వారి వివరాలు, పరిమితికి మించి లోడింగ్ చేసి తనిఖీలలో పట్టుబడిన వాహనాల వివరాలను మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. రహదారులపై సంచరించే పశు వులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గోశాలకు తరలించాలని తెలిపారు. అంతర్గత రహదారులలో కల్వర్టుల దగ్గర సూచికలు ఏర్పాటు చేయాలని, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో కుక్కల బెడదను నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓవర్ లోడింగ్, మితిమీరిన వేగం, డ్రంక్ అండ్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్ లపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. డిసిపి మాట్లాడుతూ, నూతన సంవత్సరంలో రోడ్డు ప్రమాదాల నివారణను 20 శాతం మేర తగ్గించేలా లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని, జిల్లాలో హాట్ స్పాట్ లను గుర్తించడం జరిగిందని, నగర పరిధిలో వాహనాల వేగ నియంత్రణ చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని తెలిపారు. రహదారి ప్రమాదాలు, మరణాలు తగ్గించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం మేయర్ కు శుభాకాంక్షలు తెలిపిన మంచిర్యాల మేయర్

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26:



రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గా మహంకాళి స్వామి బుధవారం పదవి బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్శి మధుకర్ హాజరై, రామగుండం మేయర్ మహంకాళి స్వామి దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ను మంచిర్యాల మేయర్ దర్శి మధుకర్ మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మంచిర్యాల మేయర్ దర్శి మధుకర్ ను శాలువతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల పట్టణ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలి

**మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్శి మధుకర్**

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26:

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో సైతం ముందుండి, భవిష్యత్తులో అన్ని రంగాల్లో రాణించాలని జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్శి మధుకర్ సూచించారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 37వ డివిజన్ లో గల మార్టిన్ గ్రామర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన క్విజ్ కాంపిటీషన్ గ్రాండ్ ఫైనల్ పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, అనంతరం పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల యజమాన్యం మేయర్ దర్శి మధుకర్ ను శాలువాతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మేయర్ మధుకర్ మాట్లాడుతూ, తాను చదువుకున్న పాఠశాలకు ముఖ్యఅతిథిగా రావడం ఆనందంగా ఉందని తెలిపారు. విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి చూపుతూ క్రీడల్లో రాణించాలని, చదువును నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. అనంతరం తనకు విద్యను నేర్పిన మార్టిన్ గ్రామర్ పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, పాఠశాలతో ఆయనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో 36వ డివిజన్ కార్పొరేటర్ ఆగాల్యాటి రాణి రాజు, 37వ డివిజన్ కార్పొరేటర్ ఖలీద్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




# బెల్లంపల్లి ప్రజల పాతికేళ్ల కల నెరవేరేనా...?

**పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్గ్రేడ్ చేస్తారా..?**

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26:

జిల్లాలోని బెల్లంపల్లి ప్రజల పాతికేళ్ల కల అయిన బెల్లంపల్లి పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్గ్రేడ్ చేస్తారా అని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్డిఎస్) రాష్ట్ర సహాయ కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జిల్లాలోని బెల్లంపల్లి పట్టణంలో గురువారం నిర్వహించిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, స్థానిక విద్యార్థులు, యువకుల పోరాట ఫలితంగా 1993లో అప్పటి ప్రభుత్వం బెల్లంపల్లి కేంద్రంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేసిందని గుర్తు చేశారు. బెల్లంపల్లి సింగరేణి ప్రాంతం కావడం చేత కళాశాలలో మైనింగ్, ఎలక్ట్రికల్ ఇన్స్ట్రుమెంటేషన్ తో పాటు ఇతర కోర్సులను అందుబాటులో ఉంచగా, ప్రతి సంవత్సరం వందల మంది విద్యార్థులు ఈ కోర్సులను అభ్యసిస్తూ, ఉత్తీర్ణులు అవుతున్నారని తెలిపారు. మారుతున్న కాలంతో పాటు భవిష్యత్తు అవసరాలకు అనుకూలంగా సాంకేతిక విద్యను మేలవించి కొత్తగా 2026 - 27 విద్యా సంవత్సరానికి గాను ఆటోమేషన్ అండ్ రోబోటిక్ కోర్సును విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా ఆరు కోట్ల రూపాయలతో అధునాతన ల్యాబ్ సౌకర్యంతో నూతన కోర్సును బెల్లంపల్లి పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశ పెట్టబోతున్నారని, ఇది చాలా సంతోషకరమని తెలిపారు. నూతన కోర్సులను ప్రవేశ పెట్టడంతో పాటు కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్గ్రేడ్ చేయాలని ఇక్కడి ప్రజల విద్యార్థులు చాలా కాలంగా కోరుకుంటున్నారని గుర్తు చేశారు. రాజకీయ నాయకులు ఎన్నికల వచ్చినప్పుడల్లా కళాశాలను అప్గ్రేడ్ చేస్తామని కల్లబొల్లి మాటలు చెబుతూ, ప్రజలను మభ్యపెడుతూ, మోసగిస్తున్నారని విమర్శించారు. చాలా కాలంగా పాలిటెక్నిక్ కళాశాల అప్ గ్రేడేషన్ కల కలగానే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో విద్యార్థులు సుధీర ప్రాంతాలకు వెళ్లి, చదువుకునే స్థోమత లేక, సాంకేతిక విద్యకు దూరమవుతున్నారన్నారు. గత సంవత్సరం కాంగ్రెస్ ప్రభుత్వం తొమ్మిది కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలలుగా అప్గ్రేడ్ చేసిందని, అందులో బెల్లంపల్లి కళాశాల పేరు లేకపోవడం చాలా బాధాకరమని తెలిపారు. ఇప్పటికైనా బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, రాష్ట్ర కార్మిక మంత్రి గడ్డం వివేక్ లు స్పందించి, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని, బెల్లంపల్లి పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్గ్రేడ్ చేసి, విద్యార్థులకు ఉన్నత విద్య అందించేందుకు తోడ్పాటు అందించాలని కోరారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.



# పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండ

### అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు 2,50,000 రూపాయల ఎల్ ఓ సి అందజేసిన పూజల హరికృష్ణ



**అక్షర కలం సిద్దిపేట ఫిబ్రవరి 26:**

సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూరు గ్రామానికి చెందిన మక్కన లక్ష్మి (భర్త: పగడయ్య) అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ వెంటనే స్పందించి కాంగ్రెస్ ప్రభుత్వం తరుపున ఎల్ ఓ సి డి ని సిద్దిపేట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో రూ. 2,50,000 గాజ ను అందజేసి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ అన్న నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని, కష్టాల్లో ఉన్న ప్రతి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని, అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు వంటి పరిస్థితుల్లో ప్రజలు ఒంటరిగా లేరని, కాంగ్రెస్ ప్రభుత్వం మరియు పార్టీ నాయకత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని హరికృష్ణ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వెల్కటూరు గ్రామ సర్పంచ్ నరేష్, కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర నాయకులు నాయిని నర్సింహా రెడ్డి, బత్తిని వెంకటేశం మాజీ ఉప సర్పంచ్, మల్లమ్మరి శంకర్ వార్డు మెంబెర్, గోళ్లేనా నరేష్ స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎంపీ వద్దిరాజు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తదితర ప్రముఖులతో కలిసి వెలుగుమట్ల బాధితులకు పరామర్శ





**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్లలో గూడు కోల్పోయిన బాధితులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు పరామర్శించారు. వెలుగుమట్ల భూదాన్ భూముల్లో సుమారు 800 కుటుంబాలకు చెందిన బడుగు వర్గాల వారు కొన్నేళ్లుగా గుడిసెలు వేసుకుని జీవనం గడుపుతున్నారు. అధికార పక్షానికి చెందిన ప్రముఖుల ప్రోద్బలంతో పోలీసుల సమక్షంలో మంగళవారం ఉదయం పేదల గుడిసెలు నేలమట్టం కావడం తెలిసిందే. ఈ దృష్ట్యా బీఆర్ఎస్ కార్యనిర్వహక అధ్యక్షులు కేటీఆర్ గురువారం మధ్యాహ్నం రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితర ప్రముఖులతో కలిసి వెలుగుమట్లకు వచ్చి నేలమట్టమైన గుడిసెలను పరిశీలించారు. కేటీఆర్ తదితర ప్రముఖులు బాధితులతో కలిసి నేలపై కూర్చుని తమ సంఘీభావం తెలిపారు. ఆ తర్వాత సీక్వెల్ సమీపాన అంబేద్కర్ భవనంలో నిర్వాసితుల శిబిరాన్ని కేటీఆర్ తదితర నాయకులు సందర్శించి బీఆర్ఎస్ కొండంత అండగా ఉంటుందని భరోసానిచ్చారు, విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖ అధ్యక్షుడు రేగా కాంతారావు, బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు, హరిప్రియ, చంద్రావతి, నాయకులు రాజేందర్, పాల్గొన్నారు.

# ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షల నిర్వహణకు చర్యలు

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26:**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నేపథ్యంలో గురువారం ఆయన జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని పలు పరీక్షా కేంద్రాలను మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్, ఏసిపి ఆర్ ప్రకాష్ లతో కలిసి ఆకస్మికంగా సందర్శించి, పరీక్షా కేంద్రాల వద్ద జరుగుతున్న భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమెరాల నిఘాను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సిపి అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ, ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ సిబ్బంది బందోబస్త్, పెట్రోలింగ్ చేస్తూ, పరీక్ష ముగిసే వరకు విధుల్లో ఉంటారని తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించడంలో పోలీసు శాఖ సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. పరీక్షా విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్, మంచిర్యాల పట్టణ ఇన్స్పెక్టర్ ప్రమోద్ రావు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# వెలుగుమట్ల ఇండ్ల కూల్చివేత తిరిగి ప్రత్యామ్నామై ఏర్పాటు చేయాలి

### అఖిలపక్ష నాయకుల డిమాండ్

### సిపిఐ, సిపిఐఎం, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, మాస్ లైన్

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**





ఖమ్మం పట్టణంలో వెలుగుమట్ల ప్రాంతంలో పది సంవత్సరాల క్రితం పేద ప్రజలు బోధన భూమిలో ఇండ్ల నిర్మాణం చేసుకొని ఇక్కడ జీవిస్తున్నారు ఈ భూమి 31 ఎకరాల ఏడు గుంటలుగా ఉంది ఇందులో 600 కుటుంబాలకు పైగా ఇండ్ల నిర్మాణం చేసుకున్నారు 2 వేల మందికి పైగా జనాభా జీవిస్తున్నారు. ఈనెల 24 వ తారీకు తెల్లవారుజామున 2 వేల మంది పోలీసులకు పైగా వెలుగుమట్ల కాలనీలో ప్రభుత్వం దించి అత్యంత ఆధునికమైన యంత్రాలతోటి పేద ప్రజలు నిర్మించుకున్న ఇండ్లను కూల్చివేశారు. దీనిని వ్యతిరేకించిన ప్రజలను మహిళలను, రాజకీయ పార్టీ నాయకులను అక్రమంగా అరెస్టు చేశారు. తప్పుడు కేసులు కూడా నమోదు చేశారు. ఇది తీవ్రమైన అన్యాయం చట్ట విరుద్ధం ఇప్పటికైనా కింద విధంగా ఈ సమస్యను తమరు జోక్యం చేసుకొని పరిష్కరించవలసిందిగా ఖమ్మం జిల్లా కలెక్టర్ గారిని అఖిలపక్ష నాయకులు కోరడం జరిగింది.

**డిమాండ్స్**

ఇండ్ల కూల్చివేతకు గురైన ప్రతి కుటుంబానికి ఎలాంటి షరతులు లేకుండా అదే స్థలంలో డబుల్ బెడ్ రూమ్ నిర్మించి ఇవ్వాలి తక్షణమే ఈ చర్యలు చేపట్టాలి. నిర్వాసితులైన కుటుంబానికి యుద్ధ ప్రాతిపదికన ప్రతి కుటుంబానికి లక్ష రూపాయలు ఇచ్చి ఆర్థికంగా ఆదుకోవాలి ఉపాధి అవకాశాలు కల్పించాలి. నిర్వాసితులపై రాజకీయ నాయకుల పై అక్రమంగా పెట్టిన కేసులను తక్షణమే ఎత్తివేయాలి. ఇల్లు నిర్మించేంతవరకు ప్రభుత్వమే వసతి సౌకర్యాలను కల్పించాలి. తక్షణ సహాయంగా లక్ష రూపాయలు ప్రతి కుటుంబానికి అందజేయాలి ఈ కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, మాస్ లైన్ జిల్లా నాయకత్వం దండి సురేష్, నరసింహారావు, పోతినేని సుదర్శన్ నున్న నాగేశ్వరరావు, అవునూరి మధు, గోకినపల్లి వెంకటేశ్వరరావు, సివై పుల్లయ్య, వై ప్రకాష్, వై విక్రం, ఝాన్సీ శిరోమణి, ఎస్.కె కాశీం, గొర్రెపాటి రమేష్, శ్రీనివాస్ రామయ్య శ్రావణ్ చింతల రమేష్ బషీర్ మస్తాన్ శ్రీకాంత్ ఉదయ్ అక్క అఖిలపక్ష నాయకులు అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

# మార్చి3 నుంచి శ్రీనాగులమ్మ జాతర

### కరపత్రం ఆవిష్కరణ.. 5 న నిండు జాతర

**మంగపేట, ఫిబ్రవరి 26 (అక్షర కలం ):**



ములుగు జిల్లా మంగపేట మండలం వాగొడ్డుగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని లక్ష్మీనర్సాపూర్ గ్రామంలోని శ్రీ నాగులమ్మ ఆలయంలో మార్చి 3 నుంచి 7 వరకు శ్రీ నాగులమ్మ మహా జాతర నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజింగ్ ట్రస్టీ, ఆలయ ప్రధాన పూజారి బాడిశ రామకృష్ణ స్వామీజీ (దేవర బాల ), ఆలయ పూజారి బాడిశ నాగ రమేష్ లు తెలిపారు. గురువారం శ్రీ నాగులమ్మ ఆలయంలో ఆలయ పూజారులు, వడ్డెలులతో కలిసి శ్రీ నాగులమ్మ మహా జాతర పోస్టర్ ను ఆలయ మేనేజింగ్ ట్రస్టీ, ఆలయ ప్రధాన పూజారి బాడిశ రామకృష్ణ స్వామీజీ (దేవర బాల ), ఆలయ పూజారి బాడిశ నాగ రమేష్ లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ మేనేజింగ్ ట్రస్టీ, ఆలయ ప్రధాన పూజారి బాడిశ రామకృష్ణ స్వామీజీ (దేవర బాల ), ఆలయ పూజారి బాడిశ నాగ రమేష్ లు మాట్లాడుతూ ఈ మహా జాతర మార్చి 3వ తేది నుండి నుంచి 7 తేది వరకు అంగరంగ వైభవంగా జరుగుతుందని తెలిపారు. మహా జాతరలో భాగంగా మార్చి 3 న మండె మెలుగుట, 4 న యెర్రెట్టల గుట్ట నుండి సడాలమ్మ, గండోర్రె గుట్ట నుండి నాగులమ్మ తల్లి రాక అనంతరం గోదావరి పుణ్య స్నానాలు, 5 న పాలమాకు ఒర్రె నుండి కంకవనం ( వనదేవత ) రాజుపేటలో ఎదుర్కొలు, రాత్రి శ్రీ నాగులమ్మ తల్లి – పగిడిద్ద రాజుల కళ్యాణం, తెల్లవారు జామున లోక కళ్యాణం కొరకు ఆలయ మేనేజింగ్ ట్రస్టీ, ఆలయ ప్రధాన పూజారి బాడిశ రామకృష్ణ స్వామీజీ (దేవర బాల ) అగ్ని గుండంలో నడవడం, 6 న అమ్మ వారికి మొక్కలు చెల్లించుంట, 7 న అమ్మ వార్లు తిరిగి వన ప్రవేశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డెలు సోడి సత్యం, కుర్సం పుల్లయ్య, మడకం రమేష్, పూజారులు కొమరం ధనలక్ష్మి, బాడిశ నవీన్, సోడి శీను, ఈసం సమ్మక్క, కట్టం సమ్మక్క, కుర్సం వీరమ్మ, కుర్సం పుల్లయ్య, లక్ష్మి, సోడి శివ నాగేశ్వరి, మడకం సుప్రజ, కుర్సం సౌందర్య, మడకం సంధ్య, చోళం కళ్యాణి, కొర్స సవిత, మడకం నాగమణి, చౌలం శాంత, గ్రామస్తులు కుర్సం విష్ణుమూర్తి, చౌలం వెంకటేశ్వర్లు, చౌలం కృష్ణమూర్తి, కొమరం మాధవరావు, బాడిశ శ్రావణ కుమార్, కొర్స వెంకటేశ్వర్లు, కారం రాజేష్, ఆలం శీను, గట్టుపల్లి అర్జున్, కొమరం రవికుమార్, చౌలం సాయి బాబు, మడకం రాజేశ్వరరావు, ఇందారపు రమేష్, మునిగల నరేశ్, మునిగల మహేష్, నిట్ట శ్యామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26:**

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డిసిపి ఎ భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి పోలీస్, రవాణా, జాతీయ రహదారులు, రోడ్లు భవనాలు, ఆర్టిసి, విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణపై రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని రోడ్లపై చెత్త, ఆటంకాలను వెంటనే తొలగించాలని, ట్రాఫిక్ పోలీసు విభాగం రోడ్లపై అనధికార వాహన నిలుపుదల, నిబంధనల ఉల్లంఘన పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై తక్కువ ఎత్తు గల బీమ్‌లు, తక్కువ విజిబిలిటీ ఉన్న చోట్ల లైటింగ్ ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారులపై రంబుల్ స్ట్రిప్స్, లైటింగ్, జాగ్రత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రోడ్లపై అదుపు తప్పిన, ఓవర్ లోడెడ్ వాహనాలు, పరిమితికి మించి వేగంగా వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ పోలీసు అధికారులు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి చేయడంలో కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో రోడ్డు భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని, గోదావరి పుష్కరాల నేపథ్యంలో ప్రమాదాల నివారణలో భాగంగా లైటింగ్ ఏర్పాట్లు చేయాలని, గ్రామీణ ప్రాంతాలలో అంతర్గత రహదారులలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని, రహదారులపై కేజ్ వీల్స్, ట్రాక్టర్ కేజ్ వీల్స్ వినియోగాన్ని నిలిపివేసేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, జిల్లా వ్యాప్తంగా వేగ పరిమితి బోర్డులు, హెచ్చరిక బోర్డులు, జాగ్రత్త సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. కూరగాయల వ్యాపారులు రహదారులపై విక్రయాలు చేయకుండా ప్రత్యేక మార్కెట్ స్థలాన్ని గుర్తించి తగు ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. రహదారులపై వాహనాల వేగాని నియంత్రించేందుకు ఏర్పాట్లు చేయాలని, ప్రతి మండల, గ్రామాల పరిధిలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో పట్టుబడిన వారి లైసెన్సులు రద్దు చేయాలని, వారి వివరాలు, పరిమితికి మించి లోడింగ్ చేసి తనిఖీలలో పట్టుబడిన వాహనాల వివరాలను మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. రహదారులపై సంచరించే పశువులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గోశాలకు తరలించాలని తెలిపారు. అంతర్గత రహదారులలో కల్వర్టుల దగ్గర సూచికలు ఏర్పాటు చేయాలని, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో కుక్కల బెడదను నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓవర్ లోడింగ్, మితిమీరిన వేగం, డ్రంక్ అండ్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్ లపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. డిసిపి మాట్లాడుతూ, నూతన సంవత్సరంలో రోడ్డు ప్రమాదాల నివారణను 20 శాతం మేర తగ్గించేలా లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని, జిల్లాలో హాట్ స్పాట్ లను గుర్తించడం జరిగిందని, నగర పరిధిలో వాహనాల వేగ నియంత్రణ చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని తెలిపారు. రహదారి ప్రమాదాలు, మరణాలు తగ్గించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల పండిట్ పిఈటి పోస్టులను వెంటనే అప్ గ్రేడ్ చేయాలి

**అక్షర కలం సిద్దిపేట ఫిబ్రవరి 26:**

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల పండిట్, పిఈటి పోస్టులను వెంటనే అప్ గ్రేడ్ చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గాడిపల్లి తిరుపతి రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం మూడు దశల పోరాట కార్యక్రమాలలో భాగంగా కలెక్టర్ల ద్వారా ప్రభుత్వానికి వినతి పత్రాలు సమర్పించే కార్యక్రమంలో భాగంగా ఈరోజు సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ద్వారా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాశాఖలో మాదిరిగానే గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలలో పనిచేస్తున్న ద్వితీయ శ్రేణి తెలుగు, హిందీ పండితుల మరియు వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను స్కూల్ అసిస్టెంట్ స్థాయి పోస్టులుగా ఉన్నతీకరించి, పదోన్నతులు ఇవ్వాలని గత సంవత్సరం కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్స్ ( సి ఆర్ టి )కు సమ్మె సందర్భముగా ఇచ్చిన హామీలను అమలు చేసి, మినిమం టైం స్కేల్ వర్తింపజేసి, రెగ్యులరైజ్ చేయాలని, ప్రతి నెల ఒకటవ తేదీన వేతనాలు చెల్లించాలని, విద్యాశాఖ మాదిరిగానే బదిలీలు మరియు పదోన్నతులు చేపట్టాలని, రాష్ట్రంలోని అన్ని గిరిజన వసతి గృహాలను ఆశ్రమ పాఠశాలలుగా కన్వర్ట్ చేయాలని, కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలకు, నూతన ఆశ్రమ పాఠశాలలకు పాటర్న్ ప్రకారం పోస్టులను మంజూరు చేయాలని. అన్ని ఆశ్రమ పాఠశాలలకు విద్యార్థుల సంఖ్యాబలం, సెక్షన్ల ఆధారంగా పోస్టులను మంజూరు చేయాలి. అన్ని ప్రాథమిక పాఠశాలలకు పీస్ హెచ్ఎం పోస్టులను మంజూరు చేయాలని, 317 జీవో అప్పీల్లన్నింటినీ పరిశీలించి పరిష్కరించాలని, ప్రత్యేక టి ఆర్ టి ని



నిర్వహించి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని, గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు కామన్ సర్వీస్ రూల్స్ ను రూపొందించి ప్రమోషన్లకు అవకాశం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చిట్యాల విజేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్, సిద్దిపేట అర్బన్, కొమురవెల్లి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనిల్ కుమార్, రాంకిషన్, దశరథం, శివరాజం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# డిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సమావేశమైన టీ పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**సంగారెడ్డి ప్రతినిధి,అక్షర కలం..**

గురువారం ఢిల్లీలో ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే తో పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఖాళీ ఐన రాజ్యసభ స్థానాలు గురించి చర్చించడం జరిగిందని ఆయన తెలిపారు.వి హనుమంతరావుకి. జెట్టి కుసుమ కుమార్ కి రాజ్యసభ ఇవ్వాలని కోరారు.రాహుల్ గాంధీనీ, మల్లికార్జున్ ఖర్గేనీ కలవడానికి ఢిల్లీ వచ్చినా రాహుల్ గాంధీ ముందస్తు షెడ్యూల్ కారణంగా ఆయన బిజీగా ఉండడంతోమల్లికార్జున ఖర్గే ని కలిసి హనుమంతరావుకి. జెట్టి కుసుమ కుమార్ కి రాజ్యసభ ఇవ్వాలని కోరారు.వారికి రాజ్యసభ అవకాశాలపై ఆలోచన చేయాలని కోరారు.జెట్టి కుసుమ కుమార్ యూత్ కాంగ్రెస్ లీడర్ , స్టూడెంట్ లీడర్ కమ్మ సామాజిక వర్గం నుంచి ఉన్నాడు.. కమ్మ నాయకుడుగా అవకాశం ఇవ్వాలని



కోరారు.జెట్టి కుమార్ ఫ్యామిలీ ఫ్రీడమ్ ఫైటర్స్, వల్ల కుటుంబం నుంచి అందరు కాంగ్రెస్ లోనే ఉన్నారు.హనుమంతరావు తెలంగాణలో అనేక ముఖ్యమంత్రులతో పని చేశారు , మూడు సార్లు రాజ్యసభ ఎంపీగా పని చేశారు.రాజీవ్ గాంధీ , సోనియాగాంధీ ఆయనకు అవకాశాలు ఇచ్చారు.వయసులో పెద్ద వ్యక్తి చురుకైన వ్యక్తి కాబట్టి మరో సారి అవకాశం ఇవ్వాలని కోరారు.ఖర్గే కమిటీలో చర్చిస్తామని హామీ ఇచ్చారు.రాహుల్ గాంధీ నిర్ణయం మేరకు ముందుకు వెళ్తాం అని జగ్గారెడ్డి అన్నారు.

# ఇంటర్ పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రత

### కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎస్పీ డి. జానకి



**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 26. అక్షర కలం :**

జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను జిల్లా పోలీసు అధికారి డి జానకి గురువారం స్వయంగా పరిశీలించారు. రెండవ సంవత్సరం పరీక్ష జరుగుతున్న సందర్భంగా మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు, రాకపోకల నియంత్రణ చర్యలను పరిశీలించి, పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరీక్ష కేంద్ర పరిసర ప్రాంతాల్లో వంద మీటర్ల పరిధిలో నిషేధాజ్ఞలు అమలు చేయాలని, అనుమతి లేని వ్యక్తులు గుంపులుగా గుమికూడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దూరవాణి యంత్రాలు మరియు ఇతర విద్యుత్ పరికరాల వినియోగంపై కఠిన నిబంధనలు పాటించేలా పర్యవేక్షణ చేయాలని చెప్పారు. పరీక్ష సమయాల్లో రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యేక నియంత్రణ చర్యలు చేపట్టాలని రవాణా విభాగ అధికారులకు సూచించారు. విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా సహకరించాలని కోరారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రశాంత వాతావరణాన్ని కాపాడాలని, అపోహలను నమ్మవద్దని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వృత్తాధికారి, పోలీసు స్థానం అధికారి బృంది పాల్గొన్నారు.

# ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26:**

జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని చెన్నూరు మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల, టిజిఎస్ డబ్ల్యూ. రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాల (బాలికలు) లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను సందర్శించి ఇంటర్మీడియట్ పరీక్షల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, జిల్లాలో మార్చి 16వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఇందు కొరకు జిల్లాలో 23 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రథమ సంవత్సరంలో జనరల్ 5 వేల 372 మంది, ఒకేషనల్ 888 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో జనరల్ 5 వేల 227 మంది, ఒకేషనల్ 830 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణలో భాగంగా



ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించడం జరిగిందని తెలిపారు. పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించాలని, పరీక్ష సమయంలో 163 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలు చేయాలని, పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్ష సమయానికి అనుకూలంగా టిజిఎస్ ఆర్టిసి అధికారులు బస్సు సౌకర్యం కల్పించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అధికారులు పర్యవేక్షించాలని, ప్రతి పరీక్ష కేంద్రంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, ప్రశ్నా, జవాబు పత్రాల సురక్షిత రవాణా కొరకు తపాలా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. అనంతరం చెన్నూరు మండల కేంద్రంలో కొనసాగుతున్న 100 పడగల ప్రభుత్వం ఆసుపత్రి నిర్మాణ పనులను సందర్శించి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వైద్య రంగాన్ని బలోపేతం చేసే దిశగా తీసుకుంటున్న చర్యలలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం చేపట్టడం జరిగిందని, పనులు త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంజయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నారెడ్డి పల్లిలో వేలాడుతున్న వైర్లకు చెక్!

### ప్రజా బాటలో గ్రామానికి 25 కిలోవోల్ట్ ట్రాన్స్ఫార్మర్ మంజూరు



**మహమ్మదాబాద్. ఫిబ్రవరి 26. అక్షర కలం :**

మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండల పరిధిలోని అన్నారెడ్డి పల్లి గ్రామంలో సంవత్సరాలుగా కొనసాగుతున్న విద్యుత్ సమస్యలకు ఎట్టకేలకు పరిష్కార దిశగా అడుగులు పడుతున్నాయి. పాతబడిన విద్యుత్ స్తంభాలు, నేలమీదికి వాలిపోయిన వైర్లు రైతులకు, గ్రామస్తులకు ప్రాణహాని కలిగించే స్థితికి చేరుకున్నాయి. వర్షాకాలంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా బాట కార్యక్రమం భాగంగా రేవంత్ రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు జిల్లా విద్యుత్ అధికారి భీమా నాయక్ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలించి, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. పాత స్తంభాలను వెంటనే తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని, వేలాడుతున్న వైర్లను మార్చి సురక్షితంగా బిగించాలని అధికారులకు సూచించారు. గ్రామంలో విద్యుత్ లోడును దృష్టిలో ఉంచుకుని 25 కిలోవోల్ట్ ట్రాన్స్ఫార్మర్ మంజూరు చేసి త్వరలోనే ఏర్పాటు చేయాలని అసిస్టెంట్ ఇంజనీర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. రైతులు పంటకాలంలో విద్యుత్ అంతరాయాల వల్ల తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారని, ఇకపై ఇలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులు హామీ ఇచ్చారు. గ్రామంలో విద్యుత్ సరఫరా స్థిరంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహమ్మదాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేఎం నారాయణ, గ్రామ సర్పంచ్ కాట్రావత్ లక్ష్మి, ఉప సర్పంచ్ లోక్య, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కాట్రావత్ మోహన్, రైతు సోదరులు, వార్డు సభ్యులు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు. గ్రామ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే ప్రజా బాట లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు. అన్నారెడ్డి పల్లిలో చేపట్టిన చర్యలు ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తాయని వారు అభిప్రాయపడ్డారు.

# మోడల్ స్కూల్ విద్యార్థుల బ్యాంకు సందర్శన

**అక్షర కలం సిద్దిపేట జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 26 :**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మోడల్ స్కూల్ విద్యార్థులు స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకును గురువారం సందర్శించారు. ఆర్థిక అవగాహన కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని విద్యార్థులు బ్యాంకును సందర్శించి వాటి సేవల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు వెంకన్న మాట్లాడుతూ విద్యార్థులకు బ్యాంకు అందించే సేవల గురించి మరియు సైబర్ క్రైమ్ ఆన్లైన్ ఫ్రాడ్ విషయాల గురించి విద్యార్థిని విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన కల్పించేందుకు బ్యాంకును సందర్శించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పివి రమణ కవిత సతీష్ బ్యాంక్ అధికారులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# వీర జవాన్ తోకని శ్రీనివాస్ విగ్రహావిష్కరణకు ప్రచార పత్రిక ఆవిష్కరణ

### దాదాపూర్‌లో రేపు ఘన కార్యక్రమం

### -- భారీగా హాజరుకావాలని నాయకుల పిలుపు

**గండీడ్. ఫిబ్రవరి 26. అక్షర కలం :**

మహబూబ్ నగర్ జిల్లా గండీడ్ మండల కేంద్రంలో కీర్తిశేషులు వీర జవాన్ తోకని శ్రీనివాస్ విగ్రహావిష్కరణకు సంబంధించిన ప్రచార పత్రికను మండల నాయకులు ఘనంగా ఆవిష్కరించారు. దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన అమర వీరుడి స్మారకార్థం నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు ప్రజలకు పిలుపునిచ్చారు. రేపు తెలంగాణ రాష్ట్రంలోని వికారాబాద్ జిల్లా దోమ మండలం దాదాపూర్ గ్రామంలో ఉదయం 11 గంటలకు విగ్రహావిష్కరణ కార్యక్రమం ప్రారంభమవుతుంది. వీర జవాన్ స్వగ్రామంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించడం గర్వకారణమని నాయకులు పేర్కొన్నారు. ప్రాంతం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి అమర వీరుడికి నివాళులర్పించాలని కోరారు. దేశ భద్రత కోసం తన ప్రాణాలను అర్పించిన తోకని శ్రీనివాస్ త్యాగం చిరస్మరణీయమని, యువత ఆయన స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని దేశసేవలో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గండీడ్ మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షులు, మాజీ మండల పరిషత్ సభ్యులు కప్లాపూర్ ఎం. ఆశన్న, కప్లాపూర్ మొగులయ్య గౌడ్, మండల సీనియర్ నాయకులు కొప్పుల శ్రీధర్, పరిగి నియోజకవర్గ నాయకులు అంజి రావణ్, ఉమ్మడి పాలమూరు జిల్లా అంబేద్కర్ సంఘం అధ్యక్షులు పగిడ్యాల్ బోరు కృష్ణయ్య, చిట్లపల్లి మల్కన్న, హస్నాబాద్ వెంకటయ్య, రంగారెడ్డిపల్లి



జే. వివేకానంద్, పగిడ్యాల్ ఎం. నారాయణ, బాలయ్య, దాదాపూర్ దస్తయ్య, వెంకటయ్య, రామ్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అమర వీరుని సేవలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని, విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని నాయకులు తెలిపారు.

# పారదర్శకంగా క్వార్టర్ల కౌన్సెలింగ్



**మందమర్రి, ఫిబ్రవరి 26 అక్షర కలం ప్రతినిధి:**

ఏరియాలోని ఖాళీగా ఉన్న క్వార్టర్ల కేటాయింపు కొరకు సింగరేణి ఎన్సీడబ్ల్యుఏ ఉద్యోగులకు పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించినట్లు సింగరేణి ఏరియా ఏరియా డివైపిఎం ఆసిఫ్ తెలిపారు. గురువారం ఏరియాలోని సిఈఆర్ క్లబ్ లో క్వార్టర్ల కొరకు దరఖాస్తు చేసుకున్న కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏరియాలో ఖాళీగా ఉన్న క్వార్టర్ల కేటాయింపు కొరకు మందమర్రి, శ్రీరాంపూర్, బెల్లంపల్లి ఏరియాలకు 101 క్వార్టర్ లను ప్రకటించగా, వీటికి 101 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని, దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు కౌన్సిలింగ్ నిర్వహించి, సీనియార్టీ ప్రకారం 17 మంది ఉద్యోగులకు క్వార్టర్లను కేటాయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా సీనియర్ పర్సనల్ అధికారి ఎం కార్తీక్, సివిల్ ఈఈ రాజు, మేనేజ్మెంట్ ట్రైనీ ఐఈడి శ్యామ్, పర్సనల్ విభాగం కార్యాలయ సూపరింటెండెంట్ రాజలింగు, సిబ్బంది, ఎస్ అండ్ పిసి సిబ్బంది పాల్గొన్నారు.

# జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలి..ఐటిడిఏ పిఓ బి.రాహుల్,

**అక్షర కలం/భద్రాచలం**

బంజారా గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ శ్రీ శ్రీ శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ రెండు వందల ఎనభై ఏడో వ జయంతి వేడుకలను ఐటీడీఏ ప్రాజెక్టుఅధికారిబి.రాహుల్ మరియు భద్రాచలం శాసనసభ్యులు తెల్లం.వెంకట్రావు,సమక్షంలో ఈనెల ఇరవై ఎనిమిదో వ తేదీ శనివారం రోజున ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన భవనంలో భోగ్ బండారో కార్యక్రమంనిర్వహించడంజరుగుతుందని సంత్ సేవాలాల్ కమిటీ సభ్యులు మోహన్లాల్ మరియు భద్రాచలం తాసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు గురువారం నాడు ఒక ప్రకటనలోతెలిపారుఈ కార్యక్రమంలో గిరిజన ప్రజలు మరియు ముఖ్యంగా బంజారాసోదరులుగిరిజనఉపాధ్యాయుని,ఉపాధ్యాయులు గిరిజన ఉద్యోగులు,బంజారా జాతి పెద్దలు, యువతీ యువకులు,మేధావులు, రాజకీయప్రముఖులు,పురప్రముఖులు, విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955